ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 21, 2004

ఆయారాం... గయారాం...

హ్యాపీ బర్త్‌డే

(21-3-2004 నుండి 27-3-2004వరకు)

ఎమ్. శివాని
4సం॥,21.3.2000
భారతి-భిక్షపతినాయి
వికారాబాద్-రంగారెడ్డి

కె. మౌనిక
9సం॥, 21.3.1995
మంజుల-జనార్ధన్‌రెడ్డి
అలంఖానిగూడ-రంగారెడ్డి

కె. భాస్కర్‌రెడ్డి
6సం॥,21.3.1998
మంజుల-జనార్ధన్‌రెడ్డి
అలంఖానిగూడ-రంగారెడ్డి

కె. కావ్య వినీత-శ్రావ్య వినీత
7సం॥,21.3.1997
విమల-బాలశౌరి
ఉక్కునగరం-విశాఖపట్నం

చందు(చంద్రశేఖర్)
4సం॥,21.3.2000
లక్ష్మీకాంతం-అప్పారావు
విజయనగరం

వేముల విన్ని
2సం॥,24.3.2002
రాములమ్మ-ప్రభాకరరావు
మంగళదాస్‌నగర్-గుంటూరు

డి. జలంధర్
2సం॥,25.3.2002
కల్పన-సాయన్న
ఆదిలాబాద్

కె. శ్రావ్య
5సం॥, 26.3.1999
లక్ష్మి-నాగేశ్వరరావు
పెదనందిపాడు-గుంటూరు

భాస్కరరెడ్డి
8సం॥, 26.3.1996
వరలక్ష్మి-రామలింగేశ్వరరెడ్డి
ఉండవల్లి-గుంటూరు

కె. సోమిక
1సం॥, 27.3.2003
కుసుమ-శంకరాచారి
చిత్తూరు

విద్యాసాగర్-వివేక్‌సాగర్
మార్చి-27
వసంత-ఏసుదాస్
అశోక్‌నగర్-హైదరాబాద్

సత్యసంహిత
6సం॥, మార్చి-1998
భవానీశైలజ-శ్రీధర్ విజయకృష్ణ
మద్రాసు-తమిళనాడు

జె. సాత్విక్
5సం॥,మార్చి-1999
వందన-బాబూరావు
జవహర్‌నగర్-హైదరాబాద్

ఎ. భవాని
7సం॥, మార్చి-1997
బాయమ్మ-రాములు
శంకర్‌పల్లి-రంగారెడ్డి

విజయ్‌కుమార్
10సం॥, మార్చి-1994
బాయమ్మ-రాములు
శంకర్‌పల్లి-రంగారెడ్డి

ఎస్. రోహిత్‌కుమార్
2సం॥, మార్చి-2002
సంతోషికుమారి-శ్రీనివాస్
జిన్నారం-మెదక్

సాయి
4సం॥, మార్చి-2000
కళ-శ్రీనివాస్
గౌలిగూడ-హైదరాబాద్



శ్రావణి
8సం॥, మార్చి-1996
విజయలక్ష్మి-పర్వేమేష్
జియాగూడ-హైదరాబాద్

సాకేత్
6సం॥, మార్చి-1998
వేణి-రాఘవ
పూనూరు-ప్రకాశం

కార్తికేయ
భార్గవి-జగదీశ్వర్
వరంగల్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

క్రికెట్టే గెలిచింది కవర్‌స్టోరీ బాగుంది

7 మార్చి 2004 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్ స్టోరీ కథనం 'క్రికెట్టే గెలిచింది' చదివిన తర్వాత దాయాద దేశాలైన భారత్-పాక్ జట్ల మధ్య ఎట్టకేలకు క్రికెట్ సిరీస్ ప్రారంభం కాబోతుండటం క్రికెట్ అభిమానులకు పండుగే. ఆడితే భారత్ పాకిస్తాన్‌లో ఆడాలి. గెలిస్తే పాక్‌పైనే గెలవాలనే ఆకాంక్ష భారత్‌లో పుట్టిన ప్రతి వ్యక్తి అనుకుంటారు. భారత, పాక్ జట్లలో నాయకత్వం, బ్యాటింగ్ ఆర్డర్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్ తదితర అంశాలలో ఎవరి బలమెంత ? మొదలగు విషయాలు సమగ్రంగా తెలుసుకోగలిగాము. అదేవిధంగా ఆరోగ్యం పేజీలో 'పన్నుపోటు పసరుమందు'లో పన్నుపోటు గూర్చి సమగ్ర సమాచారం తెలుసుకోగలిగాము. మంచి శీర్షికలు అందిస్తూ మా ఇంటిల్లిపాదిని ఆకట్టుకుంటున్న ప్రజాశక్తి ఆదివారం అనుబంధంకి ధన్యవాదాలు.

- కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్ జిల్లా

ఎవరెస్ట్‌కే గర్వకారణం

7 మార్చి 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'ఏదుగుతున్న ఎవరెస్ట్ శిఖరం తన కాళ్ళ మీద నిలబడి కన్న వాళ్ళు సైతం గర్వపడే విధంగా ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఎవరెస్ట్ శిఖరానికే గర్వకారణంగా నిలిచిన సంతోష్ యాదవ్ నిజంగా అభినందనీయురాలు.

- మేడూరి సత్యనారాయణ,
శాంతినగర్, తిరువూరు, కృష్ణాజిల్లా

టూరిస్ట్‌గైడ్ ఆకట్టుకుంటోంది

అందమైన అరణ్యాలు, సహజసిద్ధమైన ప్రకృతి అందాలు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆలయాలలో అలరారుతున్న చిత్తూరు జిల్లా వైభవాన్నీ, పర్యాటక ప్రాంతాల గురించి ఈవారం ఆదివారం ప్రజాశక్తి ద్వారా తెలుసుకోగలిగాం. ప్రకృతి సృష్టించిన అద్భుతాలుగా భావించే హార్సిలీహిల్స్,



శిలాతోరణంలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే శ్రీవెంకటేశ్వర జూపార్క్, చంద్రగిరికోట, కాణిపాకం ప్రాంతాలు వాటికవే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఏది ఏమైనా పర్యాటకులకు చిత్తూరు జిల్లా సందర్శన మంచి అనుభూతిని మిగుల్చుతుంది.

- బట్టా రామకృష్ణ,
సౌత్‌మోపూరు గ్రామం, నెల్లూరు జిల్లా

పల్లె కవికి, మల్లె వెలుగు

ఫిబ్రవరి 29 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రియల్‌స్టోరీ చూస్తే బికారి నోటి నుండి కవితా ఝరి చాలా బాగుంది. స్వరూప్ కుమార్‌లాంటి వారెందరో పల్లెల్లో ఉంటూ, చక్కని కవితా పటిమ ఉన్నా వెలుగు చూడలేకపోతున్నారు. వీరి కవిత్వంలో, పల్లెపిల్లగాలిని పట్టణ కాలుష్యం ఎలా మోసం చేస్తుందో, అన్నం పెట్టే రైతన్నను మన పాలకులు ఆకలి చావులకు ఎలా గురి చేస్తున్నారో ? పురుషుడు తాగినా, ఊగినా, లాగినా ఎంతో ఓర్పు వహించి బండెడు కష్టం చేస్తూ కూడా బానిసగానే కొనసాగుతున్న స్త్రీ ఔన్నత్యాన్ని, త్యాగమయ జీవితాన్ని వివరించారు.

- మిరియాల దుర్గారెడ్డి,
చండూరు, నల్గొండ జిల్లా

అబ్బురపరిచే 'బౌరా'

7వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన బౌరా బాగుంది. అలాగే బాలల కథ ఆటవిక న్యాయం బాగుంది. బాలల కథలు చిన్నపిల్లలకు బాగా ఉపయోగపడుతున్నాయి.

టి. ప్రతిభ, ఓల్డ్‌ఎమ్‌ఎల్‌ఏ క్వార్టర్స్, హైదరాబాద్

మనలో మాట

మేడీజీ థియరీ...

పాత కాగితాలు తిరగేస్తుంటే -

ముప్పై ఏళ్ళ క్రితం రాసిన నాటిక బయటపడింది!

ఈ దేశం ఆనాడు ఎట్లా వెలిగిందో -

ఈనాడు కూడా అట్లాగే వెలుగుతోంది!

లేకపోతే - నేటి పరిస్థితిని ఆనాడే ఎట్లా కాపీ కొట్టిరాస్తాను? ముప్పై ఏళ్ళుగా ఎల్లాంటి మార్పులేని దేశ పరిస్థితికి దిగులు పడాలో - నాయకుల చమత్కారానికి చేతులు జోడించాలో తెలీకుండా వుంది!

ఆ నాటికలో చిన్న ఘట్టం మీ ముందుంచుతున్నాను.

చిత్తగించండి....

భార్య : (ప్రేక్షకుల్తో) మీ ఇంటో మీకో బాబు వున్నాడు. వయస్సు ఎనిమిదేళ్ళు. వీధిబడిలో చదువుకుంటున్నాడు. రోడ్డు మీద తిరిగే రకరకాల కార్లను చూసేడు. ఆ లేత మనస్సు సొంత కారెక్కి తిరగాలని ముచ్చటపడింది!

భర్త : ముచ్చట మీకు చెప్పేడు. కారుకొనే తాహతు మీకు లేదు!

భార్య : అప్పుడు మీ దృష్టి మీ యింటో వున్న నులక మంచమ్మీద పడింది!

భర్త : దానికి కారు అని పేరు పెట్టేరు మీరు. గతిలేక - ఆ మంచాన్నే కారుగా ఎంచుకుని తృప్తి పడ్డాడు మీ బాబు!

భార్య : ఆ మంచం కారెక్కి స్టార్టు చేసేడు మీ బాబు! ఆ కారెక్కమని మిమ్మల్ని కూడా రీవీగా ఆహ్వానించేడు!

భర్త : ఆ పసి మనసు నొప్పించడం ఇష్టం లేక మీరు ఆ మంచం కారెక్కేరు! స్పీడుగా పోతోందని మీ బాబు మీతో గర్వంగా చెప్పేడు!

భార్య : కన్నా! జోరు తగ్గించు అన్నారు మీరు! మీ మాటతో వాడిలో కొత్త ఉత్సాహం కలిగింది. ఇంకా వేగంగా పోతున్నాడు! వేగం... కళ్ళు తిరిగే వేగం...

భర్త : అమ్మనీ నాన్ననీ తన కార్లో కూచోపెట్టుకుని... గాలితో పోటీ పడి వేగంగా కారు నడుపుతున్న మీ బాబు ఉత్సాహాన్ని మీరేమంటారు?

భార్య : దయచేసి పిచ్చి అని పేరు పెట్టకండి! ఒరే వెధవా... నువ్వెక్కింది కారు కాదురా... మంచం... నులకమంచమని నిజం చెప్పి వాడి ఉత్సాహాన్ని పాడు చేయకండి! నిత్య బాధితులకు, దినదినగండంగా బతికే దురదృష్టవంతులకు 'మంచం ఆటే' శ్రీరామరక్ష!

భర్త : అందువల్ల - కష్టాల బతుకులో మేడీజీ థియరీలు మా దగ్గరే నేర్చుకోండి!

భార్య : అయ్యా అమ్మా! ఈతి బాధలెన్ని ఎదురైనా కృంగిపోవద్దు! ఆత్మహత్యలు చేసుకోవద్దు! బలహీనులైనందుకు భయపడకండి అతి మంచివాళ్ళయినందుకు అల్లాడిపోకండి! చేతగాని వాళ్ళయినందుకు సిగ్గుపడకండి!

భర్త : మనందరికోసం అందమైన ఏర్పాటు ఒకే ఒక్కటుంది! రాజీ!

భార్య : బతుకులో ఎక్కడికక్కడ... ఎప్పటికప్పుడు... రాజీపడటం అలవాటు చేసుకోండి..

ఇది ముప్పయ్యేళ్ళనాడు నేను రాసిన థియరీ....

దేశం ఆనాడు ఎలా వెలిగిందో... ఇపుడూ అలాగే వెలుగుతోంది... మన పాలకులు చెప్పినట్లుగా మాత్రం కాదు..

అపుడు రాజీపడమని సలహా ఇచ్చేను...

ఇపుడు ఆ థియరీ వర్తించదు.

పోరాడితేనే ఏదైనా సాధించుకోగలుగుతాం...

అంతేగదా... రేపు ఎన్నికల్లో చూద్దాం వాళ్ళ సంగతి...

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

ఫలితం

కథ...8, 9

చీకటి కురిసిన రాత్రి

రియల్‌స్టోరీ... 14, 15



మౌర్యులు ఏలిన జిల్లా ప్రకాశం

టూరిస్ట్ గైడ్ . . . 21

'సిద్ధేంద్ర భారతీయం'

కళాసాహితి . . . 22, 23

ఔరా!

నిప్పు లేకుండానే పొగ

సాధారణంగా నిప్పు లేకుండా పొగ రాదంటారు. కాని ఒక్కోసారి వస్తుందని మహారాష్ట్ర సచివాలయ సిబ్బంది అంటున్నారు. అయితే నిప్పు ఒకచోట రాజుకుంటే పొగ మరోచోట వచ్చిందని తెలుసుకుని అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారట! మహారాష్ట్ర కేబినెట్‌లోని ఒకానొక మంత్రి గుండెపోటుతో మరణించారని సచివాలయంలో పుకార్లు షికార్ చేశాయట. మర్నాడు పత్రికల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎస్ బి చవాన్ చనిపోయారని వార్త రావడంతో అందరూ షాకయ్యారట. పొరపాటున విన్నామా అనుకుంటూ మరోసారి మంత్రి మరణవార్తను నిర్ధారించుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు కొందరు మంత్రి ఇంటికి ఫోన్ చేసి మళ్ళీ మరోసారి షాకయ్యారట. వారు చనిపోయారని భావిస్తున్న సదరు మంత్రిగారే ఫోన్ తీసుకునే సరికి కార్యకర్తలకు నోట మాట రాలేదు. విషయం ఏమిటంటే మంత్రి పేరుతోనే గల ఒక ప్రముఖుడు పూణేలో చనిపోతే ముంబాయిలోని సచివాలయంలో మంత్రిగారే పోయినట్లుగా పుకార్లు వ్యాపించాయి. అదీ సంగతి!



పేగు బంధం

పేగుబంధం చాలా గొప్పదంటారు. ఎక్కడైనా, ఎవరికైనా ఈ బంధం ఒకేలా ఉంటుందని ఇటీవల అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం ఫిలడెల్ఫియాలో జరిగిన ఒక సంఘటన నిరూపించింది. పది రోజుల బిడ్డ మంటల్లో కాలి మరణించిందనుకున్నారు, కాని ఆరేళ్ల తర్వాత ఆ కన్నతల్లి ఒక బాలిక పుట్టినరోజు వేడుకల్లో తన కన్నబిడ్డను గుర్తించింది. ఆరో పుట్టినరోజు జరుపుకుంటున్న ఆ బాలిక తన బిడ్డేనని పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టింది. అంతేకాకుండా డిఎన్ఏ పరీక్షలు నిర్వహించవలసిందిగా అధికారులను డిమాండ్ చేసింది. ఆ మహిళ అంత విశ్వాసంతో చెప్పడంతో అధికారులు డిఎన్ఏ పరీక్షలు నిర్వహించగా ఆమె చెప్పింది నిజమేనని రుజువైంది. అప్పటివరకు ఆ బాలిక కన్నతల్లిగా భావిస్తున్న మహిళను అరెస్ట్ చేసి ప్రశ్నించగా అసలు నిజం బయటపడింది. పిల్లలు లేని మహిళ తన బంధువుకు జన్మించిన బిడ్డను అపహరించి తన నేరం తెలియకుండా ఉండేందుకు వారి ఇంటిని కూడా తగులబెట్టింది. అగ్నిప్రమాదంలో తమ బిడ్డ చనిపోయిందని అసలు తల్లిదండ్రులు అనుకున్నారు. కాని ఆరేళ్ళ తర్వాత ఆ బాలిక పుట్టినరోజు వేడుకల్లో ఆమె అనుమానమే నిజమైంది. ఆ బిడ్డను అపహరించి ఆరేళ్ళపాటు పెంచుకున్న పెంపుడు తల్లి కటకటాలపాలైంది. పాపం!

1300 ఏళ్ళనాటి చెక్క మహాభవనం

1300 సంవత్సరాల నాడు జపాన్ మహాసామ్రాజ్యానికి రాజధాని నగరంగా భావించుతున్న ప్రదేశంలో కలపతో నిర్మించిన ఒక మహాభవంతి అవశేషాలను ఆ దేశం పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దేశంలో కేంద్రస్థాయి అధికార వ్యవస్థకు రూపకల్పన చేసిన తెమ్మూ చక్రవర్తి కాలం నాటి ఈ ప్రదేశంలో పురాతత్వవేత్తలు కొన్ని దశాబ్దాల నుండి తవ్వకాలు జరుపుతున్నారు. వారి శ్రమకు ఫలితంగా ఇప్పుడీ కట్టడం కనిపించింది. ప్రస్తుత రాజధాని టోక్యోకు పశ్చిమంగా 400 కిలోమీటర్ల దూరాన గల అసుకా అనే గ్రామంలో ఈ కట్టడం వెలుగు చూసింది. క్రీస్తుశకం 672 నుండి 686 వరకు జపాన్‌ను పరిపాలించిన తెమ్మూ చక్రవర్తి ఆనాడు చైనాలో అమలవుతున్న కేంద్ర పరిపాలనా వ్యవస్థను జపాన్‌లో కూడా అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం జపాన్‌లో కొనసాగుతున్న అధికారవ్యవస్థకు మూలం ఆయన ప్రవేశపెట్టిన విధానాలే. జపాన్ ప్రజల మొదటి అధికారిక చరిత్ర తెమ్మూ పాలనతోనే ప్రారంభమైందట. ఇంతకాలం తర్వాత ఆనాడు ఏలిన చక్రవర్తి రాజధాని నగరం అవశేషాలు కనిపించడంతో పురాతత్వవేత్తలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారట!

కార్టూన్ కదంబం

సర్వే


మాది సెక్యులర్ పార్టీ
మసీదును కూలుస్తాం
అక్కడే మందిరం కడుతాం...
మందిరం
ఓటు
నారు

పాత
కాయితాలు
పేపర్
కాయితాలు
బిజెపి
మేనిఫెస్టో
మేనిఫెస్టో
టిడిపి
మేనిఫెస్టో

ఇది ఎన్నికల రుతువు...
ప్రధాన పాలకపార్టీల కార్యాలయాలు కప్పల బెకబెకలతో అలరారుతున్నాయి..
ఆ పార్టీలో సీటు రాదనుకుంటే ఈ పార్టీలో....ఇందులో రాదనుకుంటే అందులో.... ఇలా అటు ఇటు కప్పగెంతులు వేసేవారితో ఫిరాయింపు రాజకీయాలు పసందుగా మారాయి..

మాజీ ముఖ్యమంత్రులు, మాజీ కేంద్రమంత్రులు సహా అనేకమంది నేతలు గెలిచే పార్టీల కోసం ఎగబడుతున్నారు. ఎన్నో దశాబ్దాలుగా పదవులు కట్టబెట్టిన పార్టీలను కూడా చౌకబారు కారణాలతో వదిలేస్తున్నారు.

అధికారంలో ఉన్న పార్టీలు ఈ ఫిరాయింపు రాజకీయాలను మరింతగా ప్రోత్సహిస్తున్నాయి.

ఆసేతు హిమాచలం ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం ఇదే... అంతా ఆయారాం... గయారాంల మయం....



ఆయారాం... గయారాం..

ఎం.కోటేశ్వరరావు

అనూహ్యమైన రీతిలో వచ్చిన మెజారిటీని నిలబెట్టుకొనేందుకు నాడు రాజీవ్ గాంధీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చారు. అయినా అది ఫిరాయింపులను నిరోధించలేకపోయింది. విలువల కలువలు పూయించే అమలిన రాజకీయవేత్తలుగా స్వంత డబ్బా వాయించుకొనే కమలనాధులు ఫిరాయింపులను ప్రోత్సహించటంలో రికార్డులు సృష్టిస్తున్నారు. రాబోయే ఎన్నికలలో గెలిచే కొద్ది మందిని అయినా తమ పక్షాన నిలుపుకొనేందుకు వారు కూడా లోక్‌సభను రద్దు చేయబోయే ముందు హడావుడిగా మరో ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చారు. మతోన్మాద, ముస్లిం వ్యతిరేక పార్టీగా ఉన్న బిజెపి తాను అలాంటి తన నిజరూపాన్ని కప్పిపుచ్చుకునేందుకు నానాతంటాలు పడుతున్నది. కేంద్రంలోని ఎన్‌డిఏ నుండి డిఎంకె, పిఎంకె, ఎండిఎంకె, లోక్ జనశక్తి వంటి పార్టీలన్నీ బయటకుపోవటంతో దానిని కప్పిపుచ్చుకొనేందుకు తమతో అనేక మంది చేరుతున్న వాతావరణాన్ని కల్పించేందుకు అది ఫిరాయింపులను ఆశ్రయించుతున్నది. కొత్త భిక్షగాడు పొద్దెరగడన్నట్లు ఎన్నికల సమయంలో అనేక మంది తనలో చేరిపోతున్నట్లు ప్రచారం చేసుకోవటానికి బిజెపి తాపత్రయ పడుతోంది. నిజానికి వారిలో అధికులు పరోక్షంగా వారితో ఉండే వారే. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఒక పత్రికకు సంపాదకుడుగా ఉన్న పిరాట్ల వెంకటేశ్వర్లు అనే పెద్దమనిషి బిజెపిలో చేరినట్లు ప్రకటించుకున్నారు. ఆయన సంఘపరివార్ కార్యకర్త. గత ఆరు సంవత్సరాలలో బిజెపి నాయకులతో ఏదో ఒక కార్యక్రమం నిర్వహించిన వ్యక్తి. ఒకనాటి డ్రీమ్‌గరల్ హేమమాలిని బిజెపితో ఎప్పటి నుండో సంబంధాలు కలిగి ఉన్నారు. రెండేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. ఆమె భర్త ధర్మేంద్ర కూడా ఆ పార్టీతో సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తే. అనేక మందిని వదిలి హేమమాలినిని కళాకారుల కోటా నుండి రాజ్యసభకు నామినేట్ చేయించారు. ఆమె ప్రమాణం ఇంకా చెవుల్లో గింగురు మంటుండగానే దానిని గాలికొదిలి బిజెపిలో చేర్చుకున్నారు. రాజ్యసభకు రాజీనామా చేయించి ఆ పని చేసి ఉంటే వారు తెచ్చిన ఫిరాయింపుల నిరోధక బిల్లు పట్ల విశ్వాసం ఉందని జనం నమ్మేవారు. ప్రలోభపరచటం, బెదిరించటంలో గత రికార్డులన్నింటినీ ఆ పార్టీ తలదన్నింది. హేమమాలినిని రాజ్యసభకు ఎంపిక చేయడంలో హర్యానా, ఇతర ఉత్తరాది ప్రాంతాలలో ధర్మేంద్ర చేత ప్రచారం చేయించి జాట్ల ఓట్లను రాబట్టాలనే ఎత్తుగడ కూడా ఉంది. ఓట్ల కోసం ఇతర పార్టీలు మైనారిటీలను బుజ్జగిస్తాయని బిజెపి దుమ్మెత్తి పోస్తుంది. కానీ మైనారిటీల ఓట్ల కోసం బిజెపి కరవని గడ్డిలేదు. పెట్టని ప్రలోభం లేదు. రాజ్యసభ ఉపాధ్యక్షురాలిగా ఉన్న కాంగ్రెస్ నాయకురాలు నజ్మాహెప్తుల్లాను ఐక్యరాజ్యసమితి పదవికి నిలుపుతామని ఆశపెట్టినట్లు వార్తలు వచ్చాయి. తద్వారా ఇస్లామిక్ దేశాల మద్దతు కూడా పొందవచ్చునని ఎరవేసినట్లు చెబుతున్నారు. అందుకే ఆమె సోనియా గాంధీపై విమర్శలు, వాజ్‌పేయిపై పొగడ్తలు కురిపించినట్లు సమాచారం. ఎక్కడ బెల్లం, లేదా కుళ్లిపోయిన పదార్ధాలు ఉంటే అక్కడ ఈగలు ముసురుతాయి. ఎన్నికల ముందు బెల్లంలా కనిపిస్తున్న బిజెపి చుట్టూ మూగుతున్న ఈగలు కూడా అలాంటివే. పార్టీలు ఫిరాయించటంలో కొంతమంది పేరుమోసిన వ్యక్తులు ఉన్నారు. అలాంటి వారు బిజెపిని మాత్రం ఎందుకు వదిలిపెట్టాలి అనుకుంటున్నారు. నాలుగు సార్లు కాంగ్రెస్ నుండి బయటకు పోయిన పెద్దమనిషి బంగారప్ప. కర్ణాటక వికాస్ పార్టీ, కర్ణాటక కాంగ్రెస్ పార్టీలను పెట్టారు. తాజాగా కాంగ్రెస్ నుండి మరోసారి బయటపడి తన కుమారుడితో సహా బిజెపిలో చేరి వాజ్‌పేయి భజన చేస్తున్నారు. ఇప్పటికీ ఆయనపై అవినీతి కేసులు ఉన్నాయి. గతంలో ఆయన అవినీతిని ఉతికి ఆరేసిన బిజెపి వారు ఇప్పుడు ఎలా దిగమింగుతారో దురూహ్యం. బంగారప్పపై పోటీ చేస్తున్న బిజెపి నాయకుడు పార్టీ తీరుకు ఒళ్లు మండి కాంగ్రెస్‌లో చేరి బంగారప్ప సంగతి తేలుస్తానంటూ బయలు దేరారు. దేశ రాజకీయాలలో బిజెపి పోకడలను చూసిన వారికి అవగతం అయ్యేది ఒక్కటే. వారితో చేరాలా లేదా అని ఎదుటి వారు ఒకటికి

నజ్మాహెప్తుల్లా

పదిసార్లు ఆలోచించుకోవాలి తప్ప ఎలాంటి వారినైనా చేర్చుకోవటానికి, వారికి జాతీయవాదులుగా ముద్రవేయటానికి బిజెపి సదా సిద్ధం. నలుగురూ నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు అన్నట్లు ఉంటారు. అలా చేరిన వాడే ఉత్తరప్రదేశ్‌కు చెందిన పేరుమోసిన నేరగాడు డి.పి.యాదవ్. ఇతగాడు 1998లో ఉత్తరప్రదేశ్‌లో ములాయంసింగ్ యాదవ్‌పై బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. ఇప్పుడు అభ్యంతరం చెప్పారంటున్న వాజ్‌పేయి అప్పుడు కూడా నాయకుడే అయినా ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. ఇటీవల మరోసారి యాదవ్‌ను చేర్చుకున్న తీరుపై తీవ్ర విమర్శలు తలెత్తటం, గబ్బుకొట్టటంతో నిన్ను భరించలేం బాబా అని బయటకు పంపారు. తాజాగా బిజెపిలో చేరటానికి ముందు పార్లమెంట్‌లో ఆ పార్టీకి మద్దతుగా ఓటు వేస్తున్నానని, పార్టీలో చేరటానికి ముందు అద్వానీ, ప్రమోద్‌మహాజన్, వెంకయ్యనాయుడితో మాట్లాడిన తరువాతే పార్టీలో చేరినట్లు డిపి యాదవ్ వెల్లడించారు. విలువలతో కూడిన రాజకీయాల గురించి మాట్లాడే చంద్రబాబు ఇతర పార్టీల నుండి ఎవరైనా వస్తామంటే దండపట్టుకొని సిద్ధంగా ఉంటారు. అవసరమైతే ఫిరాయింపులను ప్రోత్సహిస్తారు. అందువలన ఇలాంటి పార్టీలకు ఒక సిద్ధాంతం నిబద్ధత అంటూ ఉండవు. తమలో ఎవరిని చేర్చుకుంటే తమకు ఎంత లాభం అని తప్ప ఇతర విలువలు, చేసిన విమర్శలను ఏ మాత్రం పట్టించుకోరు. అందుకే నిద్ర లేవగానే ఒకపార్టీ గడపలో ముఖం కడిగి మరో పార్టీ దుకాణంలో అల్పాహారం తీసుకొని మధ్యాహ్న భోజనం మరోచోట రాత్రికి ఎక్కడ చేరతారో తెలియని వారు కూడా ప్రాధాన్యత పొందుతుంటారు. అందుకు కావలసింది సిగ్గూ బిడియం లేకుండా ఏ ఎండకు ఆ గొడుగు పట్టటం తెలిసి ఉండటమే.

చిక్కదు-దొరకదు

పుకార్లు వ్యాపింపచేయటం, ఎదుటి వారిపై అనుమానాలు రేకెత్తించటంలో బిజెపి పేరుమోసింది. అది సిగ్గుమాలిన పని అని కూడా వారు అనుకోరు. అయితే పదవులకోసం వెంపర్లాడే వారు కూడా అలానే ఉన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన మాజీ మంత్రి, అర్జున్‌సింగ్ తనయుడు అజయ్‌సింగ్, క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్ ఇటీవల బిజెపిలో చేరుతున్నట్లు వార్తలు వచ్చాయి. మరుసటి రోజు లబోదిబో మంటూ భోపాల్ వెళ్లి తనకలాంటి ఉద్దేశమే లేదని అజయ్ ప్రకటించారు. ఆయన మాటల ప్రకారం జరిగిందేమిటంటే, వాన నీటి నిల్వ గురించి బిజెపి అధ్యక్షుడు వెంకయ్య నాయుడితో మాట్లాడదామని ఢిల్లీ వెళ్లినపుడు ఆయనను కలిశారట. ఐదంటే ఐదునిమిషాలే అక్కడ ఉన్నారట. బయటకు వచ్చిన వెంటనే ఒక టీవీ ఛానల్ ఆయన బిజెపిలో చేరుతున్నట్లు ప్రసారం చేసిందట. అంటే వెంకయ్య నాయుడి ఇంట్లో పుకార్ల యంత్రం ఉందని మనం గ్రహించాలి. ఇక్కడ సహజంగానే ఒక అనుమానం రాక తప్పదు. వెంకయ్య నాయుడు ఇప్పుడు మంత్రి కాదు. అజయ్‌సింగ్ ఒక కాంగ్రెస్ ఎంఎల్ఏ. వాననీటి సంరక్షణ పథకాలు అమలు జరిపేది రాష్ట్ర ప్రభుత్వం. అలాంటపుడు ఒక పార్టీ జాతీయ అధ్యక్షుడు, మరో పార్టీ ఎంఎల్ఏ వాననీటి సంరక్షణ గురించి మాట్లేదేందుకు అవకాశం ఎక్కడుంది? దీన్నే తాటి చెట్టు ఎందుకెక్కావంటే దూడగడ్డి కోసమని చెప్పటం అంటారు. అన్నింటికీ మించి గమనిం చాల్సిన అంశం ఏమంటే అసలు వార్త నిజమో కాదో



తెలుసుకోకుండానే అనేక మంది ఆయన అనుయాయులు అన్నా మంచిపని చేశావ్ భేష్ అని భుజం తట్టారని కూడా సదరు అజయ్ సింగే చెప్పారు. తాను కాంగ్రెస్ కోసమే పుట్టానని దాని కోసమే మరణిస్తానని ఆయన చెప్పారు. అర్జున్‌సింగ్ మరో అడుగు ముందుకు వేసి తాను బతికి ఉండగా తన కొడుకు బిజెపిలో చేరడని, అసలు ఇలాంటి వాటి గురించి మాట్లాడటమే తమకు సిగ్గు చేటని అన్నారు. మరోపక్క వెంకయ్య నాయుడు నాకు అనేక మంది స్నేహితులు ఉన్నారు. కలిసిన వారందరూ పార్టీలో చేరతారని అర్థం కాదన్నారు. అర్జున్ సింగ్ కుటుంబ వృక్షం నుండి తాను ఫలాన్ని కోయటం లేదని కూడా చెప్పుకున్నారు. అయితే బిజెపి వర్గాలు మాత్రం తగిన లోక్‌సభ స్థానం కుదిరిన తరువాత అసలు విషయం బయటకు వస్తుందని చెప్పాయి. అజయ్ సింగ్‌ను ఆయన భార్య సరోజ ప్రభావితం చేస్తుందని వార్తలు వచ్చాయి. ఇలాంటి వారినే చిక్కదు-దొరకదు అంటారు. అజారుద్దీన్ గురించి బిజెపి వారే విలేకర్లతో చెప్పారు. అయితే ఆయన మాత్రం అవునని గానీ కాదని కానీ ఇంతవరకు ఖండించలేదు.

రాష్ట్రంలో ఇటీవల ప్రముఖ ఫిరాయింపులు

పేరు	ఏ పార్టీ నుండి	ఏ పార్టీలోకి
ఎం.వి.మైసూరారెడ్డి(కడప)	కాంగ్రెస్	తెలుగుదేశం
వై.శివరామకృష్ణారావు(కడప)	కాంగ్రెస్	తెలుగుదేశం
సూరీడు (అనంతపురం)	కాంగ్రెస్	తెలుగుదేశం
దగ్గుబాటి వెంకటేశ్వరరావు	బిజెపి	కాంగ్రెస్
ఎన్.తులసీరెడ్డి(కడప)	బిజెపి	కాంగ్రెస్
గంగుల ప్రతాపరెడ్డి(కర్నూలు)	బిజెపి	కాంగ్రెస్
గడ్డం గంగారెడ్డి(నిజామాబాద్)	తె.దే	తెరాస
మల్లాది శివన్నారాయణ(గుంటూరు)	తె.దే	కాంగ్రెస్
నారా రామ్మూర్తినాయుడు(చిత్తూరు)	తె.దే	కాంగ్రెస్
జయప్రద	తె.దే	ఎస్.పి

షాబాను కేసులో రాజీవ్ గాంధీ వైఖరిని విమర్శించి లౌకిక వ్యక్తిగా పేరుగాంచిన ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తన మంత్రి పదవిని సైతం వదులుకొని అనేక మంది ప్రశంసలతో పాటు ముస్లిం మత ఛాందసుల ఆగ్రహాన్ని కూడా చవి చూశారు. అలాంటి వ్యక్తి బిజెపిలో చేరవచ్చునని గత ఏడాదే వార్తలు వచ్చాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ప్రతినిధి విద్యాసుబ్రమణ్యం ఇంటర్వ్యూలో ఇదే అడగ్గా ఊహాజనిత ప్రశ్నగా కొట్టి పారవేశారు. మత రాజకీయాలను కాంగ్రెస్ ప్రారంభిస్తే, దానివలన లాభపడిన బిజెపిని నేను తక్కువగా ఎలా పరిగణిస్తానని కూడా అన్నారు. అలాంటి పెద్దమనిషి కొద్ది రోజులలోనే ఫిరాయించి బిజెపిలో చేరి వాజ్‌పేయి

భజన మొదలు పెట్టారు. తొలుత జనతాపార్టీతో మొదలై కాంగ్రెస్ అనంతరం, బిఎస్‌పిలో చేరారు. చివరికి బిజెపి చంకనెక్కి కాంగ్రెస్ లౌకికతత్వం గురించి విమర్శలు గుప్పిస్తున్నారు. మతతత్వంతో రాజీపడినందుకు కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించింది. భవిష్యత్‌లో కూడా అదే వైఖరి అనుసరిస్తే ప్రజలు మళ్ళీ దాని భరతం పడతారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న ఖాన్‌గారు అసలు మూలమే మతోన్మాదంతో ముడిపడిన బిజెపి తీర్థం పుచ్చుకోవటం దానిని సమర్థించుకోవటాన్ని ఏమనాలి? పూర్తిగా జో హుకుం అనటం తప్ప మరొకటి అవుతుందా?

కప్పల గురించి ఎవరు చెప్పగలరు?

ఎన్నికల సమయంలో ఏ కప్ప ఎటు దూకుతుందో చెప్పటం కష్టం. కొన్ని కప్పలు ఎలా ఉంటాయో చూడండి. మధ్యప్రదేశ్ నుండి చీలిన రాష్ట్రం ఛత్తీస్‌ఘర్. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు శరద్‌పవార్ ఎన్‌సిపి దుకాణంలో ఉన్న విద్యాచరణ్ శుక్లా తాను ఆశించిన విధంగా ఎన్నికలలో గెలవకపోగా కాంగ్రెస్ కూడా అధికారంలోకి రాకుండా ఓట్లను చీల్చటంలో జయప్రదమయ్యారు. శరద్‌పవార్‌తో విడిపోయిన ఆయన గురువు పి.ఎ.సంగ్మా పశ్చిమబెంగాల్‌కు చెందిన మమతా బెనర్జీ పార్టీలో తన వాటాగా వచ్చిన మిగిలిన పార్టీని విలీనం చేశారు. ఒంటరి వాడైన శుక్లా ఏకంగా బిజెపిలో చేరి తెల్లవారేసరికి లోక్‌సభ అభ్యర్థి అయ్యారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రషీద్ అల్వీని మాయావతి బిఎస్‌పి నుండి బహిష్కరించారు. కాంగ్రెస్‌తో పొత్తును దెబ్బదీసేందుకు ఆమె బిజెపితో చేతులు కలిపారని ఆయన ఆరోపించారు. అల్వీ బహిష్కరణ ప్రకటన వెలువడిందో లేదో వెంటనే కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ ఫోన్ చేసి బిజెపి సత్రంలో ఖాళీ ఉంది రమ్మన్నారు. అల్వీ అటు కాంగ్రెస్ ఇటు సమాజ్‌వాది పార్టీ రెండింటితోనూ సంబంధాలు కలిగి ఉన్నారు. తనకు కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్నప్పటికీ మాయావతితో ఆ పార్టీ పొత్తుపెట్టుకుంటే తనకు ఆ పార్టీలో అవకాశం ఉండదని అన్నారు. అదే నోటితో సమాజవాది పార్టీ లౌకిక శక్తి అని ప్రశంసించారు. తాను చివరకు ఏ పార్టీలో చేరినా బిజెపిలో మాత్రం చేరే సమస్య లేదన్నారు. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కూడా ఇలాగే ఇంతకాలం బిజెపిని వ్యతిరేకించి చివరకు దాని పంచనే చేరారు. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ దీదీకి ఆగ్రహం కలిగించిన తమ్ముడు సుదీప్ బంధోపాధ్యాయ ఉన్నాడు. కొల్‌కతాలో గతంలో పోటీ చేసి గెలిచిన సీటులోనే పోటీ చేస్తా అంటున్నారు. అవసరమైతే మేం మా గుర్తు ఇస్తాం అని ఆర్జేడీ లాలూ ప్రసాద్‌గారు కబురు చేశారు. మరోవైపు కాంగ్రెస్ కూడా అడిగితే మద్దతు ఇస్తాం అన్నది.

హర్యానాలో నాయకుల చిత్త చాంచల్యం వారికే తెలియదు. ఇండియన్ నేషనల్‌లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి) పేరుతో ప్రభుత్వం నడుపుతున్న ఓం ప్రకాష్ చౌతాలా – బిజెపి నువ్వెంత అంటే నువ్వెంత అనుకుని, ఒకరిపై మరొకరు తిట్ల పురాణాలు లంకించుకుని కొద్ది వారాలు కూడా గడవలేదు. అంతలోనే చౌతాలా కొత్తపల్లవి ఎత్తుకున్నారు. ఒక సభలో వాజ్‌పేయిపై ధ్వజమెత్తి, వేదిక దిగగానే విలేకర్ల సమావేశంలో ఎన్నికల తరువాత ఎన్‌డిఏతో చేతులు కలపవచ్చునని, కాంగ్రెస్‌ను ముట్టుకొనే సమస్యే లేదనీ అన్నారు. బిజెపి అంటారా దానితో మేం ఇప్పటికే కలిసి పని చేస్తున్నాం అని కూడా సెలవిచ్చారు. తెలుగుదేశంలో ఒక ముఖ్య నాయకురాలిగా ఉన్న జయప్రద కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. దానికి విరుద్ధంగా ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్‌వాది పార్టీలో చేరారు. ఎందుకంటే తెలుగుదేశం పార్టీ తన సేవలను గుర్తించలేదని వాపోయారు. అందుకే ఏ కప్ప ఎప్పుడు, ఎలా, ఎందుకు బెకబెక అంటుందో ఎన్నికల సమయంలో ఊహించటం కష్టం.

మరో సినీనటుడు జితేంద్ర కాషాయరంగు పులుముకున్నారు. నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిని విమర్శిస్తూ మధ్యప్రదేశ్‌లో ప్రచారం చేసిన పెద్దమనిషి ఇప్పుడు బిజెపిని పొగుడుతున్నారు. ఈ మధ్యకాలంలో బిజెపిలో వచ్చిన మార్పేమీ లేదు. ప్రతి ఏడూ ప్రచారం చేయమని అన్ని పార్టీల వారూ అడుగుతుంటారు. ఏదో ఒక పార్టీకి చేస్తాను. అందువలన నన్ను బిజెపి మద్దతుదారు అనుకొంటే పొరపాటు అనికూడా సెలవిచ్చారు. వాజ్‌పేయి విజన్ నచ్చింది కనుక ఇప్పుడు ప్రచారం చేస్తున్నానని చెబుతున్నారు. సినీతారలు రాజకీయ ప్రచారాలకు కాల్షీట్లు ఇవ్వటం ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. దానికి బిజెపి నాంది పలికింది. ఎందుకంటే తళుకు బెళుకులను చూపి ఓట్లు దండుకోవాలన్నది దాని అతి తెలివి. అందుకోసం భారీ మొత్తంలో డబ్బు చెల్లించి తన పార్టీలో చేర్చుకోవటం, రాజకీయ ప్రచారం చేయించటం వంటి చర్యలకు దిగజారింది. దానికి పోటీగా కాంగ్రెస్ కూడా తన పరిచయాలను ఉపయోగించి మరి కొందరు తారలను తనవైపు ప్రచారానికి వినియోగిస్తున్నది. ఇలాంటి వారి మాటలకు విలువేముంటుంది.

పేరు మోసిన ఫిరాయింపుదారు

మన రాజకీయాలలో పేరు మోసిన ఫిరాయింపుదారులలో జార్జి ఫెర్నాండెజ్ ఒకరు. ఈ పెద్దమనిషి మొరార్జీదేశాయ్ ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని గట్టిగా సమర్థించి తెల్లవారే సరికి ఫిరాయించారు. నమ్మకద్రోహానికి మారు పేరుగా నిలిచారు.

అంతటా ఆయారామ్ గయారామ్ సంస్కృతి!

రాజకీయ పార్టీలనుండి ఫిరాయించటం మన దేశానికే పరిమితమైంది కాదు. బ్రిటన్‌లో చర్చిల్ సైతం ఫిరాయింపులకు పాల్పడిన వ్యక్తే. మన దేశంలో స్వాతంత్ర్యానికి ముందు 1935 ఎన్నికలతో ఫిరాయింపులు ప్రారంభం అయ్యాయి. ఆనాడు యునైటెడ్ ప్రావిన్స్(యుపి) ముఖ్యమంత్రిగా ఉన్న గోవింద వల్లభ్ పంత్ ముస్లింలీగ్ నుండి సభ్యులను ఫిరాయింపు ద్వారా కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. ఆయన వారసుడు కెసి.పంత్ కాంగ్రెస్ నుండి ఫిరాయించి బిజెపిలో చేరి పదవులను అనుభవిస్తున్నారు. 1967–70 మధ్య కాలంలో ఫిరాయింపులకు గుర్తింపు వచ్చింది. తొలిసారిగా కాంగ్రెస్ గుత్తాధిపత్యం దెబ్బతిని పలు రాష్ట్రాలలో ఓడిపోయింది. అనేక చిన్న పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. పోయిన అధికారాన్ని

సైకిలెక్కిన మైసూరా

కాంగ్రెస్ పార్టీలో పాతికేళ్ళ పాటు వెలిగి గడిచిన తొమ్మిదేళ్ళుగా చంద్రబాబు ప్రభుత్వాన్ని అసెంబ్లీలో అనేకసార్లు ఇరుకున పెట్టిన డాక్టర్ ఎం వి మైసూరారెడ్డి ఇటీవల సైకిలెక్కేశారు. తెలుగుదేశం అధినేతను బిగ్ బాస్‌గా విమర్శించి ఆయన వద్దే చేరాడు. అలాగే ముఖ్య మంత్రి సోదరుడు నారా రామ్మూర్తినాయుడు తెలుగుదేశం విధానాలు నచ్చక కాంగ్రెస్‌లో చేరారు.

సాధించుకొనేందుకు ఫిరాయింపులను ప్రోత్సహించారు. అప్పుడే పంజాబ్ నుండి విడివడి కొత్తగా హర్యానా ఏర్పడింది. దేశానికి ఆయారామ్ గయారామ్ సంస్కృతిని అందించిన రాష్ట్రంగా చరిత్రలో నమోదైంది. వివిధరాష్ట్రాలలో 1967–70 మధ్య 1169 మంది ఎంఎల్‌ఏలు పార్టీలు ఫిరాయించారు. పార్లమెంట్‌లో వెల్లడించిన సమాచారం ప్రకారం 1967–73 మధ్య 2700 ఫిరాయింపులు జరిగాయి. వాటిలో ఒక్క 1970లోనే 500 ఉన్నాయి. వారిలో 118 మందికి మంత్రి పదవులు దక్కాయి. హర్యానా ఓటర్లు ఫిరాయింపుదార్లను ఆమోదించకపోయినా అక్కడే పేరుమోసిన ఫిరాయింపులు చోటు చేసుకున్నాయి. 1982లో అప్పటి జనతా సభ్యులందరూ ఏక మొత్తంగా కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుండి ప్రతి నూతన ప్రభుత్వానికి ఈ తలనొప్పి వస్తూనే ఉంది. హర్యానా వికాస్ పార్టీ–బిజెపి సంకీర్ణం కూలిపోయి హర్యానా వికాస్ పార్టీ నుండి వచ్చిన ఎంఎల్‌ఏల మద్దతుతో ఓం ప్రకాష్ చౌతాలా ముఖ్యమంత్రి అయ్యారు. తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఫిరాయింపుదార్లకు మొండి చేయి చూపారు. ఉత్తర ప్రదేశ్‌లో గత ఆరు సంవత్సరాలలో బిజెపి పేరు మోసిన ఫిరాయింపుల ప్రోత్సాహక పార్టీగా 'ఖ్యాతి' గడించింది. గతంలోని కాంగ్రెస్‌కు తాను ఏమాత్రం తీసిపోనని నిరూపించుకుంది. బహుజన్ సమాజ్ పార్టీని చీల్చినప్పటికీ తరువాత కాలంలో ఆ పార్టీ బిజెపి మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇంతా చేసినా యుపిలో బిజెపికి వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు. గత అసెంబ్లీ ఎన్నికలలో మూడవ పార్టీగా వచ్చింది. పార్టీ నుండి బహిష్కరించిన కల్యాణసింగ్‌ను తిరిగి చేర్చుకొని పోయిన ప్రాభవాన్ని తిరిగి పొందాలని బిజెపి ప్రయత్నిస్తున్నది.

ఆయారాం గయారాంల జన్మస్థలం

పార్టీ ఫిరాయింపులకు, కొత్త గ్రూపులు కట్టటంలో జపాన్ పేరు మోసింది. ఫలితంగా 1945 నుండి ఇప్పటివరకు 43 మంది ప్రధానులు మారారు. మన దేశంలో కాంగ్రెస్ మాదిరి దీర్ఘకాలం అధికారంలో ఉన్న లిబరల్ డెమాక్రటిక్(ఎల్‌డిపి) కొత్తపార్టీల పుట్టుక, గిట్టుకలకు వేదికగా ఉంది. దాని నుండి చీలిన గ్రూపులే కొత్తపార్టీ పేరుతో అధికారంలో తమ వాటాను దక్కించుకోవటం అక్కడి ప్రత్యేకత. రెండు పార్టీల వ్యవస్థను అక్కడ కూడా రుద్దాలని చూసినప్పటికీ అది సాధ్యం కాలేదు. ఇసాకూ సాటో 2,798 రోజులు అధికారంలో ఉండి రికార్డు సృష్టించారు. హికో హిగాషికుని కేవలం 54 రోజులు మాత్రమే పదవిలో ఉండి అతి తక్కువ రోజులు ప్రధానిగా రికార్డు సృష్టించారు. ప్రస్తుత ప్రధాని కొయిజుమి 2001 నుండి అధికారంలో కొనసాగుతూ దీర్ఘకాలం పదవిలో ఉన్న మరో ప్రధానిగా జాబితాలో చేరారు. ఫిరాయింపులు, పార్టీల చీలికలు, ప్రభుత్వాల పతనానికి కేరళను కూడా చెప్పుకోవాల్సి ఉంది. మిగతా రాష్ట్రాలలో వ్యక్తిగత ప్రయోజనాలు, అధికారదాహం అందుకు ప్రోత్సహిస్తే ఇక్కడ వాటితో పాటు కమ్యూనిస్టులను అధికారంలోకి రాకుండా చూడటం అన్నది కూడా తోడైంది. తిరువాన్కూర్–కొచ్చిన్ రాష్ట్రంగా ఉన్నపుడు 1954లో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. అక్కడ కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడకుండా చూసేందుకు గాను ప్రజాసోషలిస్టు పార్టీకి మద్దతు ఇచ్చింది. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తరువాత 1957లో జరిగిన తొలి ఎన్నికలలో తొలిసారిగా కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. రెండేళ్ల తరువాత కేంద్రం ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసింది. 1964లో ప్రతిపక్షం తెచ్చిన అవిశ్వాస తీర్మానానికి 15 మంది కాంగ్రెస్ సభ్యులు మద్దతు ఇచ్చి తమ ప్రభుత్వాన్ని తామే కూల్చుకున్నారు. దాంతో జరిగిన ఎన్నికలలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేకపోవటంతో గవర్నర్ అసెంబ్లీ రద్దుకు సిఫార్సు చేశారు. ఇలా అనేక పార్టీలు వైఖరి మార్చుకోవటంతో అనేక ప్రభుత్వాలు కూలిపోయాయి. మొత్తంమీద ఒకసారి కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే మరోసారి కాంగ్రెస్ నాయకత్వంలోని పార్టీలు అధికారంలోకి రావటం కేరళలో ఇటీవలి పరిణామం. ★



కృష్ణ మాదుగుందు

చిమ్మచీకటి.

సైకిల్ బెల్ మోగింది.

సీత తలుపు తీసింది.

అప్పుడే మోగింది. గోడ గడియారం పది గంటలు కొట్టింది.

"ఏటండీ ఇంత ఆలస్యం?" అన్న భార్య మాట వినిపించుకోలేదు. బదులు పలుకలేదు అప్పారావు. నేరుగా బాత్‌రూమ్‌లో కెళ్ళి స్నానం చేసి ఏమే... టవల్ తీసుకురా అన్నాడు.

టవల్ అందిస్తూ ఎందుకోసమో ఈ యూనియన్ గొడవలు. అందులో పడిపోయి సంసారమే పట్టించుకోరు. అనవసరంగా ఆరోగ్యం పాడవుతుంది. ఇంకా ఏదో చెప్పబోతుంటే...

చాల్లేవే. ఆలస్యమైందంటే యూనియన్ గొడవనేనా! ఈవేళ ఓవర్ టైమ్ చేశాను. పకోడిపొట్లం విప్పుతూ అన్నాడు.

భోజనం వడ్డిస్తూ "మా అన్నయ్య వుత్తరం రాశాడు."

"ఏమని?"

"ఇదిగో వుత్తరం మీరే చూడండి."

"నువ్వు చదివావా లేదా?"

"చదివాను"

"మరినేను చూడ్డం ఎందుకు? ఉన్న విషయం ఏమిటో చెప్పు"

ఆఁ ఏముంది. మా అన్నకొడుకు మన అన్నపూర్ణను పెళ్ళి చేసుకోవటానికి సుముఖంగా లేడట. అందుకే అమ్మాయికి వేరే సంబంధం చూసుకోమని రాశాడు.

సర్లే ఏడ్చాడు. ఇప్పుడు మీదపడి ఇచ్చే వాళ్ళు ఎవరు? ఏదో ఆనాడు మీ అన్నయ్యే తన కోడలిగా చేసుకుంటానంటే సర్లే అన్నాను.

ఆనాటిమాట...

బావా మావాడు బి.ఏ. ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. మరివాడికి ఉద్యోగం దొరికితే అన్నపూర్ణతో పెళ్ళి జరిపించాలని వుంది. నువ్వు ట్రేడ్ యూనియన్ నాయకుడివి కదా! నీ ఇన్‌ఫ్లుయెన్స్ ఉపయోగించి ఉద్యోగం వేయించాలి. మా వూరు షుగర్ ఫ్యాక్టరీలో పోస్టులు ఖాళీ వున్నాయని అడిగాడు సీత అన్నయ్య.

సీత కళ్ళు జిగేలు మన్నాయి. తన కూతురు అన్నకు కోడలవుతున్నందుకు సంతోషించి అదెంతపని అన్నయ్యా మావారికి. వాసుకు ఉద్యోగం వచ్చినట్టే అనుకో. అంది సీత నవ్వుతూ.

సిగరెట్‌ను పెదాల నడుమ వుంచుతూ సిజర్ లైట్ వెలిగించి సిగరెట్ ముట్టించాడు. గట్టిగా ఒక దమ్ము పీల్చి ఉస్‌మని నిట్టూర్చాడు. పొగంతా బైటికొచ్చేసింది.

చూడు వెంకట్రావ్!.. మా అమ్మాయిని కోరి నువ్వు కోడలిగా చేసుకుంటానంటే మాకేమీ అభ్యంతరం లేదు. పోతే కట్నం ఇచ్చుకునే స్థితిలో నేను లేను చెప్పాడు అప్పారావు.

ఎంతమాట బావా తప్పు కదా! మా చెల్లెల్ని ఇచ్చేటప్పుడు నీకేమైనా ఇచ్చామా. ఉద్యోగమొస్తే అదే కట్నం అనుకుంటాం. నేలకు చూపు విసుర్తూ పలికాడు సీత అన్న.

కొన్ని రోజుల తర్వాత సీత అన్న ఉత్తరం రాశాడు. బావా నీ పుణ్యాన మా అబ్బాయికి ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషం. అన్నపూర్ణ ఎలా వుంది ? అంటూ. చెల్లెలు క్షేమం అడగకపోయినా సంతోషించింది తన కూతురి క్షేమం అడిగినందుకు.



కొడుక్కి జాబు పర్మనెంటయ్యింది. వేలకు వేలు కట్నాలిస్తామని సంబంధాలు వస్తున్నాయి. వెంకట్రావులో తమార్పు వచ్చింది. అందుకే అన్నపూర్ణను పెళ్ళిచేసుకోవడానికి వాసు సుముఖంగా లేదని లెటర్ రాశాడు బావకు.

వెంకట్రావ్‌లాంటి స్వభావం గల మనుషులను యూనియన్‌లో చాలా మందిని చూశాడు. అందుకే అప్పారావు బాధపడలేదు సీత దుఃఖిస్తున్నా. ఊరుకోవే. దాని నుదుట రాత ఎలా వుంటే అలా జరుగుతుంది. ప్రయత్నం వరకే మన పని. నువ్వేమీ బాధ పడకు. అన్నపూర్ణకు ఏమి తక్కువ అందం లేదా గుణం లేదా? చెయ్యి వంకరా కాలు వంకరా? సమయం కోసం ఆగాలి. అవకాశం వస్తుంది. అప్పుడు ప్రయత్నించాలి. అందరూ మీ అన్నలాంటి వారు కాదు కదా! అని చెప్పి దుఃఖాన్ని దిగమింగాడు. కాని కళ్ళలో నీళ్ళు మాత్రం కనిపిస్తాయి.

తెల్లారింది. సమయం ఏడున్నర. సైకిలు తుడుస్తున్నాడు అప్పారావు.

ఇదిగో క్యారేజీ. నీసాలో చారుపోశాను. నెమ్మదిగా వెళ్ళండి. లేదంటే అక్కడికెళ్ళే పాటికి సీసా ఖాళీ. దాంతో మీ పొట్ట ఖాళీగానే వుంటుంది.

సీసా ఖాళీ కాదులే. "అదేం జరగదు సీసా ఖాళీ అయినా... తోటి మిత్రుల క్యారేజి వుంటుంది కదా!"

రెండుసార్లు బెల్ మోగించి టాటా చెప్పేసి సైకిల్‌పై బయల్దేరాడు.

గురూ జీతాల పెంపుదల సంగతి



ఏమన్నా తెలిసిందా ప్రశ్నించాడు సహ కార్మికుడు.

"ప్రొప్రైటర్ హైదరాబాద్ వెళ్ళారు. రాగానే ఏ విషయం తెలుస్తుంది. అయినా మన వాళ్ళలో పటుత్వం లేదు. న్యాయం కోసం ఎదురు నిలవలేరు. భయపడి కొందరు మనకెందుకులే అని తప్పించుకునేలా వున్నారు. మనలో సడలింపు వుండకుండా ఒక్కటిగా వుంటే విజయం సాధించగలం. మనం ఎంతో కష్టపడి పని చేస్తున్నాం. రానీ అడుగుదాం" చెప్పాడు అప్పారావు.

అప్పారావు పని చేస్తున్న వర్క్‌షాపు ఎం.ఎస్.ఎం. సర్వీస్ సెంటర్. అందులో అన్ని రకాల వాహనాలు రిపేరు చేస్తారు. దానికి ఓనర్ నర్సింగరావు. అతనొకప్పుడు చిన్న మెకానిక్. చిన్న షెడ్‌లాంటిద్ పెట్టుకున్నాడు మొదట్లో. తర్వాత అదే పెరిగి పెద్దదైంది. ఇప్పుడు మహావృక్షమై రోజుకు లక్షలు గడిస్తుంది. అన్ని కంపెనీల డీలర్‌షిప్ కూడా వుంది.

అప్పారావు సర్వీసు పదిహేనేళ్ళైనా జీతం పదహారు వందలు లేదు. తిన జీతం ఇస్తే తిరగబడతారని వారిని అణగతొక్కాడు. కడుపు మాడుతుంటే డబ్బు కోసం తప్పక పనిలోకి వస్తారని నర్సింగరావు సిద్ధాంతం.

ధరలు పెరుగుతుంటే జీతం పెరగకపోతే సంసార జీవనం అదుపు తప్పదూ! అందుకని ఒకసారి ఒకచోట అందరూ గుమిగూడి సంఘస్థాపనకు నాంది పలికారు.

ఐకమత్యాన్ని విచ్ఛిన్నం గావించుటకు మేనేజరు ఎన్ని పన్నాగాలు పన్నినా ఫలించలేదు. బాధించారు కూడా. అయినా ధైర్యంగా నిలబడి యూనియన్ రిజిస్టర్ చేయించి నెంబర్ తెచ్చుకున్నారు.

"రేపు ప్రొప్రైటర్ వస్తున్నారు. పెట్టిన డిమాండ్లను అంగీకరించకపోతే ఏం చేయాలి" అంశంపై చర్చించాల్సిందిగా అప్పారావు కోరాడు.

చివరికి సమ్మె చేద్దాం అని నిర్ణయానికొచ్చారు.

వర్కర్లు కోరుతున్నవి న్యాయమైనవే కాగా చిరు కోర్కెలని తెలిసి కూడా అంగీకరించని మనసు లేనివాడు నర్సింగరావు.

అప్పారావు ఎంతో వినయంతో ప్రార్థించినా కఠోర వాక్యాలను పలికాడు నర్సింగరావు. అయినా అదరలేదు బెదరలేదు అప్పారావు.

మా కోర్కెలను మన్నించకపోతే స్ట్రైక్ చేస్తామని చెప్పాడు అప్పారావు.

చెయ్యండి ఇదేమైనా ప్రభుత్వ సంస్థ అనుకొంటున్నారు! మాకేమైనా గవర్నమెంట్ ఫండ్స్ వస్తాయనుకొంటున్నారా! జీతాలు పెంచాలి... పెంచాలి అంటే డబ్బు ఎక్కణ్ణుంచి వస్తుంది. సంస్థకు లాభం వుంటే కదా? ఇవ్వటానికి, చెయ్యండి సమ్మె ఎన్నాళ్ళు చేస్తారో. కడుపు మాడితే మీరే వస్తారు నా దగ్గరికి. వచ్చి కాళ్ళా వేళ్ళా పడతారు. వేడుకొంటారు. సమ్మె వల్ల తనే ఎక్కువ నష్టపోతానని తెలుసు. లోలోపల భయం వున్నా... పైకి మాత్రం అలా అన్నాడు అంతే.

నర్సింగరావు డౌన్... డౌన్.. మేము పనిలోకి రాము. స్ట్రైక్ చేస్తాం అంటూ కేకలు పెట్టసాగారు



కార్మికులు.

ఇంటికి వెళ్ళ దలచిన అప్పారావు సైకిలు తొక్కుతున్నాడు. స్ట్రైక్ పరిణామాల ఆలోచనలు మెదడులో చుట్టుముట్టాయి. సైకిల్ సడన్‌గా ఆగింది. ఎదురుగా నలుగురు దుండగులు. చేతిలో కత్తులున్నాయి. అయినా అప్పారావు జడుసుకోలేదు. ఎవరు పంపగా వచ్చారో గ్రహించాడు. ధైర్యంగా సైకిల్‌ను పైకెత్తి గిరగిర తిప్పి దుండగుల్ని చితకబాది పంపాడు.

ఇంటికి చేరుకోగానే శుభవార్త విన్నాడు.

ఏమండీ!.. రేపు మన అన్నపూర్ణను చూడ్డానికి వస్తున్నారు. పక్కింటి పుల్లమ్మ తీసుకొచ్చింది సంబంధం. కుర్రాడు మంచివాడేనట బ్యాంకులో ఉద్యోగమని సీత చెప్పడంతో స్ట్రైక్ ఆలోచనలు చెల్లా చెదురైనాయి. అన్నపూర్ణ భవిష్యత్‌పై పోనిచ్చాడు దృష్టి.

అబ్బాయి అమ్మాయిని చూశాడు. నచ్చిందని చెప్పాడు. లక్ష రూపాయలు కట్నమిచ్చి, పెళ్ళి జరిపించాలని పిల్లాడి తండ్రి డిమాండ్ చేశాడు.

కట్నం ఇవ్వలేని అప్పారావునోట మాట రాకపోగా, సంబంధం కోసం వచ్చిన వాళ్ళు లేచిపోయారు.

ఇక దీనికి పెళ్ళయ్యే యోగం లేదని దిగులుతో కృంగిపోతున్న సమయంలో ఇంటిముందు కారు ఆగింది. అందులో నుంచి మేనేజరు దిగాడు.

"ప్రొప్రైటర్ పిలుస్తున్నాడు. నీవు వెంటనే రావాలి" చెప్పాడు మేనేజరు.

వెంటనే బయలుదేరాడు అప్పారావు.

రా అప్పారావు కూర్చో. నువ్వు చాలా గొప్పవాడివి. నీ హృదయం కూడా చాలా మంచిది. నీ చుట్టూవున్న వారు నిన్ను చెడుపుతున్నారు. నువ్వు ఎలాగూ ఆపదలో వున్నావు... అదే... అమ్మాయికి పెళ్ళి చేయడం ఎలా అని. తీసుకో ఈ డబ్బు. మొత్తం లక్షా యాభైవేలు వుంది. అమ్మాయికి ఘనంగా పెళ్ళి జరిపి యూనియన్‌కు దూరంగా వుండు. ఊ.. క్యాష్ తీసుకెళ్ళు. స్ట్రైక్ డౌను చేసి అందరూ పనిలోకి వెళ్ళేలా చూడు, చెప్పాడు నర్సింగరావు.

అందితే జుత్తు అందకపోతే కాళ్ళు. అది మీ సిద్ధాంతమని నాకు తెలుసు. నేను గడ్డితినే పశువును కాదు. నీతి గల మనిషిని. పాపిష్టి డబ్బు నాకవసరం లేదు. ఎందరు చెమటోడ్చి పని చేస్తే నీకీ డబ్బు వచ్చిందో తెలుసా. డిమాండ్లు నువ్వు తప్పక అంగీకరించి తీరాలి. అంతవరకు సమ్మె కొనసాగుతూనే వుంటుందని హెచ్చరించి వెళ్ళాడు.

అప్పారావు అన్నపూర్ణ విషయంలో బెంగపెట్టుకొన్నాడు. సమ్మె మొదలై నెలరోజులయ్యింది. అలాగే కొనసాగుతూనే వుంది. కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. సంసారాన్ని ఎంతో కష్టంగా లాగుతున్నారు. పనుంటే పస్తుల బాధ తప్పేది, నాలుగు డబ్బులు చేతిలో వుండేవి, అనవసరంగా స్ట్రైక్ చేస్తున్నాం అనిపించింది కొందరికి. పనిలోకి వెళితే మంచిదనిపించింది మరికొందరికి.

అప్పారావును చూట్టానికొచ్చాడు సహకార్మికుడు రంగారావు. కలిసిపోయే స్నేహితుడు కూడా. మరింత దగ్గరై చెప్తున్నాడు. నీవు దిగులు మానెయ్. నీ కూతుర్ని నా కోడలిగా చేసుకొంటాను. కట్నకానుకలు వద్దు పెళ్ళి చెయ్యి చాలు సింపుల్‌గా. నా కొడుకు శ్రీనివాసరావు ఎంత మంచివాడో నీకు బాగా తెలుసు కదా! మూగవాడని సందేహమా?

"అబ్బే అదేం కాదు" అన్నాడు అప్పారావు.

అమ్మాయ్ అన్నపూర్ణా ఇలా రా. ఈ ఫొటో చూడు మంచి మనసు కలవాడు, మూగవాడు. నీకు నచ్చితే ఇష్టమైతే ఒప్పుకో. బలవంతమేమీ లేదు అని తండ్రి చెప్పగానే సిగ్గుతో లోపలికెళ్ళింది.

చూడు రంగారావు నా మనసు బాగా లేదు. అన్నపూర్ణ పెళ్ళయ్యేంత వరకు యూనియన్ బాధ్యతలు నీవు స్వీకరించవలసిందిగా అందర్నీ ఒప్పిస్తాను. నిలబడి పనులు జరిపించగల సమర్థుడవని, నమ్మకస్తుడవని నీకప్పగిస్తున్నానని చెప్పాడు అప్పారావు.

వద్దంటూనే నాయకత్వం వహించడానికి అంగీకరించాడు రంగారావు.

కార్మికులు సమావేశమయ్యారు. అప్పారావు తనకున్న పర్సనల్ సమస్యలు చెప్పి రంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకునేలా చేశాడు. రంగారావు లీడరయ్యాడు.

అన్నపూర్ణ పెళ్ళి జరిగింది. ఉదారుడైన వియ్యంకుడు దొరికినందుకు సంతోషించాడు అప్పారావు.

వర్క్‌షాప్ సైరన్ వినిపించింది. కార్మికులు పనిలోకి వెళ్ళిపోయారు. జీతం పది రూపాయలు కూడా పెంచలేదు. డిమాండ్లన్నింటినీ ఉపసంహరించుకున్నారు. అది రంగారావు మహత్యం. యజమాని నర్సింగరావు దర్శకత్వం.

మరుసటి రోజే బస్ కిందపడి మరణించాడు రంగారావు. రిపేరుకొచ్చిన బస్సు బ్రేకు ఫెయిలైన సంగతి తెలియక బస్సుపోనిచ్చాడు జూనియర్ మెకానిక్.

పథకం ప్రకారం అప్పారావు కూతుర్ని తన కోడలిగా చేసుకున్నాడు. సమ్మె విరమించి, కార్మికులకు ద్రోహం చేసినందుకు లక్షన్నర లంచంగా తీసుకున్నాడు. నాయకుడిగా అవతారమెత్తి వందలాది కార్మికులు రక్తం నుండి వచ్చిన సొమ్ముకాశపడ్డాడు. ద్రోహిగా ముద్రవేయించుకున్నాడు. అకాల మరణం పొందాడు. ★

ఎప్పుడూ ఎన్నికలే అయితే పరిపాలనెక్కడ ?



అంపశయ్య నవీన్

“ఎన్నికల హడావుడి రోజు రోజుకు పెరిగిపోతున్నది. ఈసారి ఐదారు నెలల ముందునుంచే ఎన్నికల వాతావరణం వచ్చేసింది.”

“ఐదారు నెలల ముందేం ఖర్మ... అసలీ దేశంలో ఎప్పుడు చూసినా ఎన్నికల వాతావరణమే... ఐదేళ్ళకొకసారి ఎన్నికలంటే ఎవ్వరూ నమ్మరు”

“అలా అంటావేమిటి? మన రాజ్యాంగం ప్రకారం ఐదేళ్ళకొకసారే కదా ఎన్నికలు జరగాలి.”

“ఐదేళ్ళ దాకా ఎవరాగుతున్నారు? ఎప్పుడు వాతావరణం మనకు అనుకూలంగా ఉందనుకుంటే అప్పుడే అసెంబ్లీలను, లోక్‌సభను రద్దు చేసి పారేసి ఎన్నికలు పెడ్తూనే వున్నారుగా...”

“ఔననుకోండి...”

“ఆ కారణమే కాకుండా అసెంబ్లీలనూ, లోక్‌సభనూ రద్దు చెయ్యడానికి మరెన్నో కారణాలు... రూలింగ్ పార్టీ మెజారిటీ కోల్పోయిందనుకో. ఎన్నికలే.. ప్రభుత్వం మీద ప్రతిపక్షం వాళ్ళు పెట్టిన అవిశ్వాస తీర్మానం గెల్చిందనుకోండి ఎన్నికలే....”

“మొన్న అలాగే జరిగింది కదా... ఒక్క ఓటుతో అప్పటి ప్రభుత్వం ఓడిపోతే మళ్ళీ ఎన్నికలు పెట్టిరి...”

“ఇంకో తమాషా ఏమిటంటే లోక్‌సభకొకసారి ఎన్నికలు... కొన్ని అసెంబ్లీలకొకసారి మరికొన్ని అసెంబ్లీలకు మరోసారి... ఇట్లా ప్రతి సంవత్సరం మూడో, నాలుగో రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతూనే వుంటాయి. దాంతో దేశంలో ఎప్పుడు చూసినా ఎన్నికల వాతావరణమే... ఓట్లు ఎట్లా రాబట్టుకోవాలని ప్రతి రాజకీయ పార్టీ ఎత్తుకు పై ఎత్తులు వెయ్యడమే... దీంతో మన పాలకులకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో దేశాన్ని ముందుకు తీసుకుపోయే తీరిక ఎక్కడుంటున్నది... ఈ పని చేస్తే ఓట్లు పోతాయేమో... ఈ పని చేస్తే ఓట్లు పడ్తాయేమోనని ఆలోచించడమే గానీ ఏ పని చేస్తే దేశానికి ప్రయోజనకరంగా ఉంటుందని ఆలోచిస్తున్నారా మన రాజకీయ నాయకులు? ఎన్నికలు రాబోతున్నాయనగానే రూలింగ్ పార్టీ వాళ్ళు ప్రజల మీద వరాల వర్షాన్ని కురిపించడం... స్వర్గాన్ని తెచ్చి పెడ్తామనీ, చంద్రున్ని భూమ్మీదకు రప్పిస్తామని వాగ్దానాల మీద వాగ్దానాలు చెయ్యడం... ప్రాంతీయ సెంటిమెంట్లను రెచ్చగొట్టడం.. కులాలను, మతాలను ఉపయోగించుకోవడం... ఏ పని చేసినా ఓట్లు కోసమే తప్ప నిస్వార్థంగా దేశసేవ చేద్దామనీ, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కొన్ని పథకాలను చేపడదామని ఆలోచించే వాళ్ళవరైనా ఉన్నారా? ఇంత తరచుగా... ఇంచుమించు ఏడాదికొకసారి జరిగే ఎన్నికల మీద ప్రజలకు విశ్వాసం ఉంటుందా?”

“అసలు పెద్ద పొరపాటు ఎప్పుడు జరిగిందో నన్ను చెప్పనిస్తారా?”

“చెప్పు”

“1971లో అప్పటి ప్రధానమంత్రి మొదటిసారిగా పార్లమెంట్ ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికలతో విడదీశారు. అంతకుముందు నాలుగుసార్లు అంటే 1952లో, 1957లో, 1962, 1967లో అసెంబ్లీలకు, పార్లమెంట్‌కూ ఎన్నికలు ఒకేసారి జరిగేవి.. ఐదేళ్ళ దాకా ఎన్నికల ఊసు ఉండేది కాదు. కానీ ఏనాడైతే పార్లమెంట్ ఎన్నికల్ని అసెంబ్లీ ఎన్నికలతో వేరు చేశారో ఆనాటి నుండి ఈ దేశంలో ఎన్నికలే ఎన్నికలు.”

“అదొక్కటే కాదు.. ఇంకో కారణం కూడా చెప్పాలి... అదే సమయంలో ఎవ్వరు అధికారం ఇస్తానంటే వాళ్ళవైపు వెళ్తూ పార్టీలు మార్చేవారి సంఖ్య పెరిగిపోయింది. ఆయారాంలు, గయారాంలు ఎక్కువైపోయి ఐదేళ్ళకోసం ఎన్నుకోబడిన ప్రభుత్వాలను పడగొట్టడం మొదలెట్టారు. దాంతో మళ్ళీ ఎన్నికలు... మళ్ళీ ఎన్నికలు.. కొన్ని అసెంబ్లీలకైతే సంవత్సరానికోసారి ఎన్నికలు పెట్టే పరిస్థితి ఏర్పడింది.”

“కొన్ని రాష్ట్రాల్లో పార్టీ మార్చిన ప్రతీ ఎం.ఎల్.ఏ.కు మంత్రిపదవు లిచ్చారు...”

“రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో పార్టీలు మార్చే ఆయారామ్.. గయారామ్‌ల ఆట కట్టించడానికి యాంటీ డిఫెక్షన్ చట్టాన్ని చేశారు. కానీ ఆ చట్టం కూడా పార్టీలు మార్చే వాళ్ళను కట్టడి చెయ్యలేకపోయింది.”

“ట్రాజెడీ ఏమిటంటే ఆ చట్టం రాకముందు ఐదుగురో ఆరుగురోపార్టీలు మార్చేవారు. ఆ చట్టం వచ్చాక చాలా పెద్ద సంఖ్యలో... 20 మంది... 30 మంది ఒకేసారి పార్టీ మార్చేస్తున్నారు... ఎందుకంటే ఎన్నుకోబడిన వాళ్ళలో మూడింట ఒకవంతు మంది పార్టీ మారితే అది పార్టీ మార్చడం కిందకు రాదుట. కొత్త పార్టీ పెట్టినట్లుగా అవుతుందట. యాంటీడిఫెక్షన్ చట్టంలో వున్న ఈ లొసుగును ఉపయోగించుకొని ఒకేసారి మూడో వంతు మంది లెజిస్లేచర్లు పార్టీ మారుస్తున్నారు...”

“ఈ లొసుగునూ సవరించారట కదా... ఇప్పుడైనా పార్టీలు మారే వాళ్ళను ఆపగలుగుతామా?”

“మన వాళ్ళు ఎంత తెలివైన వాళ్ళంటే దీంట్లో కూడా ఏదో లొసుగును పట్టుకొని పార్టీలు మారుతూనేఉంటారు.”

అధికారకాంక్ష తప్ప ప్రజాసేవ ధ్యాస లేనివారు ఎన్నిసార్లు అధికారానికి వచ్చినా ఏమి ప్రయోజనం ? మరో నాలుగు నెలలాగితే ప్రజలు ఓడిస్తారేమోనన్న భయంతో ముందుగా ఎన్నికలు పెట్టే వాళ్ళు, ఏదో ఒక ప్రచారంతో ఎన్నికలు జరిపించేసి మరోసారి అధికారంలోకి రావాలనుకునే వారు ఇలాగాక ఎలా వ్యవహరిస్తారు ? ★

పామర జ్యోతిష్కుడు

మేకల మదన్‌మోహన్‌రావు

అవంతీపురం రాజుగారు ఓసారి తన విలువైన ఉంగరాన్ని పోగొట్టుకున్నాడు. ఎంత వెతికినా దాని జాడ తెలియలేదు. 'ఉంగరం జాడ తెలిపిన జ్యోతిష్కునికి అతని జీవిత కాలమంతా సంతోషంగా బతకటానికి అవసరమైనంత ధనం బహూకరిస్తాను' అని చాటింపు వేయించాడు.

అదే దేశంలో 'గంబారా' అనే వ్యక్తి వున్నాడు. అతను చాలా బీదవాడు. చదవటం, రాయటం అస్సలురాదు. 'జ్యోతిష్కునిగా వెళ్లి నా అదృష్టాన్ని పరీక్షించుకుంటా' అనుకుని గంబారా సరాసరి రాజ దర్శనానికి వెళ్లాడు.

ఆ రాజు గంబారాను నమ్మాడు. అతని కోరిక ప్రకారం జ్యోతిష్యశాస్త్ర గ్రంథాలు చదవటానికి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించాడు. అందులో ఒక మంచం, పరుపు, బల్ల, పెద్ద జ్యోతిష్య గ్రంథం, కాగితం, కలం, సిరా సిద్ధంగా వుంచారు. గంబారా ఆ బల్ల ముందున్న ఆసనం మీద కూర్చుని ఏవేవో పిచ్చిగీతలు గీయసాగాడు. అతనికి రోజూ ఆహారం తీసుకొచ్చే నౌకర్లు వాటిని చూసి గంబారా మహా జ్యోతిష్యశాస్త్ర విద్వాంసుడని భావించారు.

నిజానికి రాజుగారి ఉంగరాన్ని దొంగిలించింది ఆ నౌకర్లే. ఎక్కడ ఆ విషయం బయటపడుతుందోనని వారు భయపడసాగారు. దాంతో గంబారా తమ వైపు గంభీరంగా, పాచకాశంగా చూసినప్పుడల్లా అతనికి నిజం తెలిసిపోయిందని బెదిరిపోసాగారు. గంబారా మాత్రం వాళ్లు తనను విద్వాంసుడు అనుకునేలా ప్రవర్తించసాగాడు. కానీ వాళ్ల తొట్రుపాటు, గాబరా గమనించిన అతనికి వాళ్ల మీద అనుమానం కలిగింది. జ్యోతిష్యంలో ఏ మాత్రం పరిజ్ఞానం లేకున్నా గంబారా జిత్తులమారి. ఆ నౌకర్లకు ఉంగరం గురించి ఎంతో కొంత తెలుసనుకున్నాడు. ఆ రహస్యాన్ని రాబట్టడానికి ఓ ఉపాయం ఆలోచించాడు.

ఓ రోజు నౌకర్లు ఆహారం తీసుకొచ్చే సమయానికి గంబారా మంచం కింద దాక్కుని, చుట్టూ దుప్పట్లను తెరల్లాగా వేలాడదీశాడు. నౌకర్లలో పెద్దవాడు వచ్చి చూస్తే గదిలో ఎవ్వరూ లేరు. అతడు వచ్చిన అలికిడి విని గంబారా, "ఆ వచ్చింది వాళ్లల్లో ఒకడు" అని గట్టిగా అరిచాడు. దాంతో కంగారుపడ్డ నౌకరు చేతిలోని పళ్లేన్ని బల్ల మీద పెట్టి, ఒక్క ఉదుటున బయటికి పరుగుతీశాడు.

ఆ తర్వాత రెండవ నౌకరు వచ్చాడు. వెంటనే 'ఆఁ వాడు రెండవ వాడు" అన్నాడు. అంతే... అతను వెనక్కి చూడకుండా పరిగెత్తాడు. కాసేపటికి మూడవవాడు రావడం గమనించిన గంబారా, "ఆఁ వాడు మూడవ వాడు" అని గట్టిగా అన్నాడు. పారిపోయిన ఆ ముగ్గురూ రహస్యంగా కలుసుకున్నారు. "మన రహస్యం జ్యోతిష్కునికి తెలిసిపోయింది. ఆ విషయాన్ని అతడు రాజుగారికి చెప్తే మన తలలు ఎగిరిపోతాయి. అందుకని జ్యోతిష్కుని దగ్గర మన తప్పు ఒప్పుకోవాలి" అని నిర్ణయించుకున్నారు.

ముగ్గురూ గంబారా దగ్గరకు వెళ్లి, "అయ్యా! మేము చాలా బీదవాళ్లం. మీరు కనిపెట్టిన మా రహస్యాన్ని రాజుగారికి చెప్తే ఆయన మమ్మల్ని చంపేస్తాడు. కాబట్టి ఈ వరహాల మూట తీసుకోండి. రాజుగారికి మాత్రం ఈ విషయం చెప్పకండి" అంటూ దీనంగా వేడుకున్నారు.

గంబారా ఆ సంచీని అందుకొని, "చెప్పనుగానీ మీరు నేను చెప్పినట్లు చెయ్యాలి. ఆ ఉంగరాన్ని మీరు రాజుగారి పెరట్లో వున్న కోడిపుంజు తినేలా చెయ్యండి. మిగతా కథను నేను నడిపిస్తాను" అన్నాడు. వాళ్ళు ఆ ప్రకారమే చేశారు. గంబారా రాజుగారి సన్నిధికి వెళ్లి, "అయ్యా! ఇన్ని రోజులూ శాస్త్రాలు శోధించి ఆ ఉంగరం ఎక్కడ వుందో కనిపెట్టాను" అన్నాడు.

"ఎక్కడుంది?" ఆత్రంగా ప్రశ్నించాడు రాజు.

"దాన్ని ఓ కోడిపుంజు మింగేసింది" అన్నాడు గంబారా. అతను చూపెట్టిన కోడిపుంజును కోశారు. రాజుగారి ఉంగరం బయటపడింది. రాజు పరమానందభరితుడై గంబారాకు అంతులేని ధనధాన్యాలు ఇచ్చాడు. అతని గౌరవార్థం పెద్ద విందు కూడా ఏర్పాటుచేశాడు. దానికి పుర ప్రముఖులందర్నీ ఆహ్వానించాడు. విందులో వడ్డించిన వంటకాల్లో 'గంబేరి' అనే ఒక రకమైన చేప కూర కూడా వుంది. ఆ రకం చేపలు వాళ్ల దేశంలో దొరకవు. పొరుగుదేశపు రాజు ఆ చేపల కూరను కానుకగా పంపాడు. అలాంటి చేపలను ఈ దేశం వాళ్లు చూడటం ఇదే మొదటిసారి.

రాజుగారికి గంబారాను పరీక్షించాలన్న ఆలోచన వచ్చింది. వెంటనే "నువ్వు మహా జ్యోతిష్య విద్వాంసుడివి కాబట్టి ఈ వంటకం ఏమిటో చెప్పాలి" అన్నాడు రాజు. ఆ చేప గురించి ఇంతకుముందు ఎప్పుడూ విని, చూసి ఎరగని గంబారా ఇరకాటంలో పడ్డాడు. "అరేయ్ గంబారా! నీ విషయం తెలిసిపోయిందిరా!" అని తనలో తనే గొణుక్కున్నాడు. గంబారా అసలు పేరు తెలియని రాజు, "శభాష్! నువ్వు చెప్పింది సరైనదే. దాని పేరు గంబేరీనే" అన్నాడు. ఆయన 'గంబారా' అన్న దాన్ని 'గంబేరీ'గా విన్నాడు.

గంబారాను 'ఈ ప్రపంచంలోకెల్లా గొప్ప జ్యోతిష్య విద్వాంసుడు' అంటూ పురప్రముఖులంతా వేనోళ్ళ కొనియాడారు. ☆



ఏమేం వున్నాయి?



హాయ్! పక్కనే ఓ బొమ్మ వుంది చూశారుగా. అందులో మీకు ఏమేం కనిపించాయి? నాలుగువైపులా సరిగ్గా చూసి చెప్పండి. 'అబ్బా! మళ్లీ ఏదో తిరకాసు పెడుతున్నారు. అయినా చెప్తాం. ఓ చెరువు. అందులో ఒక దిబ్బ. అక్కడ రెండు పెద్ద పెద్ద చెట్లు, ఓ చేప, పడవ (అందులో ఏదో వుంది), బోలెడన్ని పక్షులు వున్నాయి. ఈసారి మేం సరైన జవాబే చెప్పామనుకుంటున్నాం' అంటున్నారు కొందరు చిన్నారులు. కానీ.... ఇదిగో మేం ఈ మాట అంటున్నామో లేదో కొందరు నేస్తాలు మొఖం తిప్పకుంటున్నారు. అదేంలేదర్రా! ఆ బొమ్మను అలా చూస్తే మీరు చెప్పింది రైటే. ఐతే తిరగేసి చూడండి. ఏం కనిపించాయి? చెరువు గట్టున ఏదో ఒక పక్షిగారు ముక్కుతో పురుగును పట్టుకున్నట్టు వుంది. పైగా దూరంగా బోలెడన్ని పక్షులు ఎగురుతూ కనిపిస్తున్నాయి. అవునా. మరి ఇప్పుడు చెప్పండి. మీరు సరిగ్గా చూడలేకపోయారనేకదా అర్థం. 'ఆ... అలా ఎలా కుదురుతుంది? మీరు బొమ్మను ఒకలా చూపించినప్పుడు ఎలా వుందని అడిగారు. మేం అప్పుడు కనిపించినవే చెప్పాం. దాన్ని తిరగేసి చూడమని చెప్పలేదుకదా' అంటున్నారు ఇంకొందరు. కానీ మేం ముందే చెప్పాం. నాలుగువైపులా చూడమని. అవునా. అందుకే పరిశీలనా శక్తిని పెంచుకోవాలనేది. సరే. వచ్చేవారమైనా సరైన జవాబు చెప్పడానికి ప్రయత్నించండి.

బాతుగారికి రంగులు వేద్దామా!



చిన్నారి చిత్రకారులు

వై.సుధాకర్,
9వ తరగతి,
నాగర్‌కర్నూల్,
మహబూబ్‌నగర్.



డి.దుర్గా భవాని,
5వతరగతి,
ప్రగతి బాల విద్యాలయం,
సుందరయ్యనగర్,
తాడేపల్లి.

ఎం.చంద్రకళ, 9వ తరగతి,
ప్రగతి బాలవిద్యాలయం,
సుందరయ్యనగర్, తాడేపల్లి.

డి.శివనాగమల్లేశ్వరరావు, 2వతరగతి,
ప్రగతి బాల విద్యాలయం,
సుందరయ్యనగర్, తాడేపల్లి.

క్విజ్-1

1. మల్బరీ తోటలను వేటికోసం పెంచుతారు?

ఎ. పట్టు పురుగులు బి. టీ, కాఫీ

2. బట్టల సోడా అంటే ...?

ఎ. సోడియం కార్బొనేట్ బి. సోడియం బైకార్బొనేట్

3. పుర్రెలో కదిలే ఏకైక ఎముక ఏది?

ఎ. కింది దవడ ఎముక బి. పై దవడ ఎముక

4. అక్బర్ గురువు?

ఎ. తాన్‌సేన్ బి. అబుల్‌ఫజల్

5. కొల్లేరు సరస్సు....?

ఎ. మంచినీటి సరస్సు బి. ఉప్పునీటి సరస్సు

6. ఉష్ణమునకు మూల కారణం ?

ఎ. సూర్యుడు బి. చంద్రుడు

7. భూమి వంగి తిరగడం వల్ల ఏమి ఏర్పడుతున్నాయి?

ఎ. రుతువులు బి. గ్రహణాలు

8. ఈజిప్టు రాజధాని?

ఎ. కైరో

బి. కంపాలా

9. 'యక్షగానం' ఏ రాష్ట్రానికి చెందినది?

ఎ. కర్నాటక

బి. ఆంధ్రప్రదేశ్

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?

ఎ. ఇఎంఎస్

బి. ఎన్‌పిఆర్

క్విజ్ 100కు జవాబులు

1. గోదావరి 2. నెమలి 3. బంతి 4. రైల్వే సంస్థ 5. కనిష్కుడు 6. మానవుడు 7. క్యారెట్, చిలగడదుంప 8.గడలను (ముచ్చెలను) పాతడం 9. ఎముకమజ్జ 10. ప్రకాష్‌కరత్

క్విజ్ 99కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఎన్.శివరావు, 5వ తరగతి, తెనాలి. **సి.పూర్ణిమ**, 8వ తరగతి, ఖమ్మం. **ఎల్.విద్యాకుమారి**, 8వ తరగతి, విద్యానగర్, పొన్నూరు. **డి.విజయదుర్గ**, 6వ తరగతి, విజయనగరం. **డి.వెంకటేశ్వరరావు, 9వ** తరగతి, లక్ష్మీనగర్, మెదక్. **బి.విజయసుందర్**, 6వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **పి.పంకజ్**, 10వ తరగతి, విద్యానగర్, హైదరాబాదు.

కలం స్నేహం

పేరు: కోట్ల భీముదు,
వయసు : 16 సం॥
చదువు :10వ తరగతి
హాబీలు : వాలీబాల్ ఆడడం, పుస్తక పఠనం.
పూర్తి చిరునామా: కోట్ల భీముదు, సన్నాఫ్ కోట్ల వల్లన్న, ఇం.నెం: 9-167, తిలక్ నగర్, పెంట్లవెల్లి, కొల్లాపూర్, మహబూబ్‌నగర్.

పేరు: బి.వంశీకృష్ణ,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్, చెస్, కబడ్డీ ఆడడం, ప్రజాశక్తి పేపర్ చదవడం.
పూర్తి చిరునామా : బి.వంశీకృష్ణ, 10వ తరగతి, శ్రీ విద్యానికేతన్ స్కూల్, టి.అగ్రహారం, రాజంపేట, కడప.

కోతి-దూలం

మగధ దేశంలో అరిదుర్గం అనే పట్టణం వుంది. ఆ పట్టణంలో శుభదత్తుడు అనే సంపన్నుడున్నాడు. అతనికి సంతానం లేదు. ఆ కారణంగా పట్టణంలోని పాడుబడిన దేవాలయాన్ని బాగు చేయించి పుణ్యం సంపాదించుకోవాలనుకున్నాడు. అందుకోసం వడ్రంగులను నియమించాడు.



వడ్రంగులు పని ప్రారంభించారు. వారు ఒక పెద్ద దూలాన్ని రంపంతో కోయడం ప్రారంభించారు. అది సులభంగా చీలిపోవడం కోసం అక్కడక్కడ పెద్ద పెద్ద మేకులు కొట్టారు. ఆ దూలాన్ని సగం వరకు కోసేసరికి సాయంత్రం అయ్యింది. దాన్ని అలాగే వదిలేసి వడ్రంగులు ఇళ్లకు వెళ్లిపోయారు.

దేవాలయం ఆవరణలో బోలెడన్ని పొన్నాయి చెట్లున్నాయి. వాటి మీద ఒక కోతుల గుంపు నివసిస్తుండేది. అందులో ఒక తుంటరి కోతి పిల్ల వుంది. అది ఎప్పుడూ ఏదో ఒక అల్లరి పని చేస్తూనే వుంటుంది. అది పొద్దున్నుండి వడ్రంగులు చేస్తున్న పనిని గమనిస్తూ వుంది. తాను కూడా దూలాన్ని రంపంతో కొయ్యాలనుకుంది. అందరూ వున్నప్పుడు వెళ్తే వాళ్లంతా కొడతారని భయపడింది.

అందుకని వడ్రంగులు అటు వెళ్లగానే కోతి చెట్టు మీద నుంచి దిగింది. సగం వరకు కోసి వున్న దూలం దగ్గరకు వెళ్లింది. దాని మీద ఎక్కి ఒక కాలు చీలివున్న దూలంలో, ఇంకో కాలు బయటికి పెట్టి కూర్చుంది. కూర్చున్నది కూర్చోకుండా దూలం చీలికలో ఇరుక్కున్న మేకును బయటకు లాగింది. చీలివున్న దూలం ఒకటైపోయింది. మధ్యలో వున్న కోతి కాలు నలిగిపోయింది.

ఆ బాధ తట్టుకోలేక కోతి పెద్దగా ఏడ్చింది. రక్షించడానికి దగ్గర్లో ఎవరూ లేరు. అదలాగే ఏడ్చి, ఏడ్చి చనిపోయింది.

కరటకుడు ఈ కథ అంతా చెప్పి, 'కాబట్టి అవసరంలేని పనుల జోలికి ఎవరు పోయినా కోతిలా చనిపోక తప్పదు. దొరికినది తృప్తిగా తిని పడి వుండక, లేనిపోని పెత్తనాలు మనకెందుకు?" అన్నాడు.

దమనకుడు ఏమీ మాట్లాడకపోవడం చూసి కరటకుడు మళ్లీ ఇలా అన్నాడు. "దమనకా! ఒక గాడిద లేని పెత్తనం నెత్తిన వేసుకుని చావుదెబ్బలు తిని చచ్చిపోయింది. ఆ కథ కూడా చెబుతా విను" అన్నాడు. ఆ కథ ఏంటో తెలియాలంటే ఏడు రోజులు ఆగాల్సిందే.

డ్యూగాంగ్

ఎర్ర సముద్రం, హిందూ మహాసముద్రంలో నివసించే ఈ క్షీరదం నీటిలోని మొక్కలను భోంచేస్తుంది. తిమింగలంలాంటి శరీరంతో బూడిద రంగులో వుండే డ్యూగాంగ్ దాదాపు మూడు మీటర్ల పొడవు, 300 కిలోల బరువు పెరుగుతుంది. ఈ జీవిని చర్మం, కొవ్వు, మాంసం కోసం వేటాడతారు.



ఎల్.గౌరి

చీకటి కురిసిన రాత్రి



సమయం అర్ధరాత్రి 12 గంటలు...

ఊరు ఊరంతా గాఢనిద్రలో ఉంది.

అటువైపుగా ఓ చిన్న పూరిల్లు. వరండాలో తల్లీకూతుళ్లు, మరో చిన్నపిల్ల నేలపై నిద్రపోతున్నారు. పొద్దల్లా టీకొట్టులో కష్టపడి పనిచేసిన శరీరాలు కాస్త సేద తీరుతున్నాయి. తల్లి, పదకొండేళ్ల బాలిక ఒకపక్కగా, 20 ఏళ్ల కూతురు మరో వైపుగా నిద్రపోతున్నారు.

ఎలాంటి అవాంతరాలు లేకుండా కూతురి పెళ్లి జరిగిపోవాలని ఆలోచిస్తున్నట్లుంది తల్లి ముఖం. మరో పదిరోజుల్లో ఆరంభం కాబోతున్న తన కొత్త జీవితం గురించి కలలు కంటుంది కూతురు, కాబోయే పెళ్లి కూతురు.

అంతలోనే.. భయానకమైన దారుణం...

గుడిసెలోకి యాసిడ్ సీసాలతో నాలుగు మానవ మృగాల ప్రవేశం.

క్షణాల్లో విధ్వంసం... దానవత్వం కురిపించిన అగ్నివర్షం...

ఆ కన్నెపిల్ల కల చెదిరిపోయింది. పెళ్లికళతో పుత్తడిబొమ్మలా మెరిసిన కూతురి రూపం... జీర్ణించుకోలేనంత వికృతంగా మారిపోయింది.

తల్లి ముఖంపైన, కళ్లలోనూ, నోట్లో యాసిడ్.

పన్నెండేళ్ల బాలికపైనా యాసిడ్...

***

విశాఖ జిల్లా గొలుగొండ మండలం కెడిపేటలో 2001 జనవరి 26 రాత్రి జరిగిన ఈ సంఘటన ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్ర భయోత్పాతాన్ని సృష్టించింది. ఉన్మాదం, అహంకారం, ద్వేషం, పురుషాధిక్యం నరనరానా జీర్ణించుకుపోయిన దాయాదులు పగతీర్చుకొనేందుకు మహిళలను పావులుగా వాడుకున్నారు. ఇళ్లస్థలం విషయమై తలెత్తిన వివాదం- ముగ్గురు మహిళల జీవితాలను అతలాకుతలం చేసింది.

***

బాధితులది నిరుపేద కుటుంబం. ఇంటిల్లిపాదీ కష్టపడితే తప్ప పూటగడవని బతుకు వారిది. కొడుకులిద్దరూ, భర్త తలో పనీ చేసి తెచ్చిన డబ్బు కుటుంబ ఖర్చులకు సరిపోయేది కాదు. బతుకు తెరువుకోసం తల్లీకూతుళ్లిద్దరూ ఇంటివద్దనే చిన్న టీ దుకాణం నడిపేవారు. తల్లి పేరు లగుడు పాప. కూతురు కుమారి. కొద్దిపాటి ఇంటిస్థలం విషయమై దాయాదులతో తగాదా తలెత్తింది. అది అప్పుడప్పుడు కొనసాగుతూనే ఉంది. ఆ స్థలాన్ని తమ సొంతం చేసుకోవాలనేది దాయాదుల పన్నాగం. అది కుదరక పాప కుటుంబంపై పగ పెంచుకున్నారు. మంచిచెడ్డలు మరిచారు. మానవత్వం వదిలేశారు. పగ



తీర్చుకొనేందుకు మహిళలనే ఎన్నుకున్నారు. ఈ దారుణానికి కొద్దిరోజుల ముందే కుమారికి వివాహం నిశ్చయమైంది. మరో పది రోజుల్లో పెళ్లి. ఉన్నంతలో కూతురి పెళ్లి బాగా జరిపించాలని ఆ తల్లి ఆశ. ఎప్పుడూ ఆ ఆలోచనల్లోనే మునిగి ఉండేది పాప.

* * *

ఆ రోజు పొద్దంతా టీకొట్టు పని, వంటావార్పు భోజనాలు ముగించుకొని ఎప్పటిలాగే తల్లీకూతుళ్లు చెరోవైపుగా పడుకున్నారు. పాప చెల్లెలి కూతురు కూడా ఆ రోజు వారితోనే పడుకుంది. అర్ధరాత్రి కావస్తోంది. వీధుల్లో అలికిడి లేదు. అంతా నిద్రపోయారు. దాయాదుల కుటుంబానికి చెందిన నలుగురు మనుషులు నెమ్మదిగా ఇంట్లో ప్రవేశించారు. ముందుగా కుమారి ముఖంపైన, ఒళ్లంతా యాసిడ్ పోశారు. అగ్నివర్షం కురిసినట్టయి అదిరిపడి లేచింది కుమారి. ఆ అదుటుకు పాప కూడా మేల్కొంది. దాయాదులు తలపెట్టిన దారుణం ఆమెకు అర్థమయింది. తన కూతురినేమీ చేయొద్దని బతిమిలాడింది. కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడింది. అయినా వాళ్ళు కరగలేదు. మరింత క్రౌర్యంగా వ్యవహరించారు. పాప నోట్లో, కళ్లల్లో యాసిడ్ పోశారు. ఆ వివాదంతో ఎలాంటి సంబంధమూలేని బాలిక కూడా దాడికి గురయింది. ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో మాడి పోతున్నట్టు విలవిల్లాడారు. వారి అరుపులూ పెడబొబ్బలూ విని ఊరు తుళ్ళిపడింది. జనం అక్కడికి చేరుకునేసరికి దుండగులు పారిపోయారు.

* * *

ఈ దురాగతాన్ని ఊరిజనమంతా తీవ్రంగా నిరసించినప్పటికీ వెంటనే ఒక్కటిగా ముందుకు రాలేకపోయారు. విషయం తెలిసిన వెంటనే అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రతినిధులు బాధితులను పరామర్శించారు. గ్రామస్థులను కలిశారు. వారిని కదిలించారు. గ్రామంలోని అల్లూరి యువజన సేవా సంఘం సభ్యులు కూడా బాధితుల పక్షాన నిలిచారు. తర్వాత ఊరిజనం ఒకటయ్యారు. భారీర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వెయ్యిమందికి పైగా మహిళలు పాల్గొన్నారు. గ్రామస్థుల ఒత్తిడి మేరకు రెండ్రోజుల తరువాత కెడిపేట పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఆ వెంటనే నిందితులు తమకున్న పలుకుబడిని ఉపయోగించి... బెయిల్ మంజూరుకు, కేసు మాఫీకి ప్రయత్నాలు ప్రారంభించారు. ఐద్వా జిల్లా, స్థానిక కమిటీలు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నాయి. బాధితులకు న్యాయం జరిగేలా, దుండగులకు శిక్ష పడేలా బహుముఖంగా కృషి చేశాయి.

* * *

విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల పరిస్థితి దయనీయంగా ఉంది. కుమారి ముఖం, శరీరం పూర్తిగా కాలి ముద్దయింది. రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పాప కళ్లు, నోరు కాలిపోయాయి. వారు ఎక్కువ రోజులు బతకరని డాక్టర్లు చెప్పేశారు. తీవ్రంగా గాయపడిన తల్లి నిరంతరం తన కూతురి గురించే ఆలోచించేది. పెళ్ళయి హాయిగా గడపాల్సిన బిడ్డ ఇంత దారుణంగా, భయానకంగా దాడికి గురయిందే- అని బాధపడేది.

బాధితులకు మొదట్లో కెజిహెచ్‌లో సరైన వైద్యం అందలేదు. ఉచిత వైద్యం అందించాలని ఐద్వా జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. దీనికి ఆసుపత్రి సూపరింటెండెంట్ నిరాకరించటంతో- ఆందోళన చేపట్టారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆఖరికి సూపరింటెంటెండెంట్ దిగొచ్చారు. ఉచిత వైద్యం అందించారు. అదే సమయంలో గ్రామంలో ఐద్వా ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళనలు నడిచాయి. నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయాలని గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. బెయిల్ మంజూరు చేయొద్దని హెచ్చరించారు. అయినా పోలీసులు పట్టించుకోలేదు. నిందితులను బెయిల్‌పై విడుదల చేశారు. వాళ్ళు ఊళ్ళో దర్జాగా తిరగడం ప్రారంభించారు. అధికార యంత్రాంగం వైఖరి పట్ల ఐద్వా తీవ్రంగా స్పందించింది. ఐద్వా ఆధ్వర్యాన బెయిల్ మంజూరుకు నిరసనగా పోరాటం మొదలయింది. గ్రామంలో భారీ బహిరంగ సభ, రాస్తారోకోలు, ధర్నాలు, బంద్... ఒకదాని వెంట ఒకటిగా, పరంపరగా సాగాయి. ఈ పోరాటానికి ప్రజలనుంచి విస్తృతమైన మద్దతు లభించింది. నిందితులను శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని కోరుతూ కె.డిపేట, ఆ చుట్టుపక్కల గ్రామాల డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రికి, హోంమంత్రి దేవేంద్రగౌడ్‌కు టెలిగ్రాములు పంపారు. పోస్టుకార్డు క్యాంపెయిన్ నిర్వహించారు. బాధితులకు ఉచిత వైద్యం అందించాలని, నిందితులకు శిక్ష విధించాలని కోరుతూ విశాఖ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐద్వా ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి పుణ్యవతి ఇతర నాయకులు హోం మంత్రిని కలిశారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

* * *

ఇదిలా సాగుతుండగానే.... ఆసుపత్రిలో కుమారి పరిస్థితి క్షీణించింది. కొద్దిరోజుల నరకయాతన అనంతరం తుదిశ్వాస విడిచింది. పాపను ఇటు గాయాల బాధ, అటు కూతురి మరణం కుంగదీశాయి. ఏ ఆశా, ఆధారం ఆమెకు మిగల్లేదు. కొద్ది నెలల అనంతరం వికృత రూపంతో జీవచ్ఛవంలా ఆసుపత్రినుంచి బయటపడింది. బాలిక రూపు మారిపోయింది.

* * *

బాధితులకు ఆర్థిక సహాయం అందించి, ఆదుకోవాలని ఐద్వా పలు జన్మభూమి సభల్లో దరఖాస్తులు సమర్పించింది. పట్టించుకోని ప్రజాప్రతినిధులను నిలదీసింది. ఈ క్రమంలోనే చింతపల్లి ఎంఎల్ఎ ఎంవివి సత్యనారాయణ బాధితులకు ఐదెకరాల భూమిని ప్రకటించారు. అయితే అదిప్పటికీ అమలు కాలేదు.

బాధితుల పక్షాన ఐద్వా న్యాయపోరాటం సాగించి, విజయం సాధించింది. రెండేళ్ల అనంతరం ఈ కేసులోని నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మహిళలపై యాసిడ్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ తీర్పు మహిళలకు ఊరటే. అయితే, ఈ వ్యవస్థలో తీర్పుల మాదిరిగానే నిందితులు తప్పించుకోవటానికి లొసుగులూ ఉన్నాయి. నిందితులు హైకోర్టుకు అప్పీలు చేసుకొని, బెయిల్ తెచ్చుకున్నారు. ప్రస్తుతం స్వేచ్ఛగా తిరుగుతున్నారు.

ఎందుకిలా జరుగుతోంది?

యాసిడ్ దాడి నిందితులకు కోర్టు శిక్ష విధించినా వారు కొంతకాలానికి విడుదలై స్వేచ్ఛగా బయటకు వస్తారు, హాయిగా బతుకుతారు. కానీ దాడికి గురైన వారి పరిస్థితి? బతికినంతకాలం జీవచ్ఛవాల్లా అంధకారంలో బతకాల్సిందే. జీవితాంతం శిక్ష అనుభవించాల్సిందే. ఇలాంటి కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం, ఓదార్పు అందడం లేదు. యాసిడ్ దాడులకు గురవుతున్నవారిలో అత్యధికులు పేద, మధ్యతరగతి మహిళలు కావడంతో వారికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునే స్తోమత ఉండడంలేదు. ఇటు నష్టపరిహారమూ అందక, మరోవైపు ఉపాధీలేక బతికుండీ నరకయాతన అనుభవిస్తున్నారు.

ప్రస్తుతం కెడిపేటలో ఉంటున్న యాసిడ్ దాడి బాధితుల పరిస్థితీ ఇంతే. పాపకు గ్రామంలో కూలిపని దొరకడంలేదు. మంచినీటికోసం బోరుకు వెళ్లలేని పరిస్థితి. ఆమె రూపాన్ని ఆమె జీర్ణించుకోలేక పోతోంది. ఈ పరిస్థితుల్లో ఇంట్లోనే ఉంటూ ఉపాధిలేక నరకప్రాయమైన జీవితం గడుపుతోంది. దాడి సమయంలో 11 ఏళ్ళ వయస్సున్న బాలిక ఇప్పుడు పెళ్లీడుకొచ్చింది. కాలిన గాయాలతో ఉన్న ఆమెకు పెళ్లి సంబంధాలు రావడంలేదు. పేదకుటుంబీకులైన తల్లిదండ్రులకు లక్షల కట్నంపోసి పెళ్లిచేసే స్తోమతలేదు. వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందలేదు. ఎంఎల్ఎ ఎంవివి సత్యనారాయణ ప్రకటించిన భూమీ దక్కలేదు. నష్టపరిహారమివ్వాలని హోం మంత్రిని కలిసినప్పటికీ దిక్కులేకుండా పోయింది. ఈ పురుషాధిక్య సమాజంలో ఆడవాళ్లను ఎలాగైన లొంగదీసుకునేందుకు, తమ దారికి తెచ్చుకొనేందుకు పురుషులు పాల్పడే పైశాచిక చర్యల్లో యాసిడ్ దాడి ఒకటి. స్త్రీకంటూ ఒక సొంత అభిప్రాయం, ఆత్మాభిమానం ఉండకూడదని భావించే కొంతమంది పురుషాహంకారులకు యాసిడ్ దాడులు ఉపయోగపడుతున్నాయి. తనను ప్రేమించలేదని, పెళ్లి చేసుకోలేదని, మాట వినలేదని స్త్రీలపై పగ, ప్రతీకారం పెంచుకున్న మగవాళ్లు దాడులకు పాల్పడుతున్నారు. దాడిచేసినవారు చట్టాలనుంచి అవలీలగా తప్పించుకుంటున్నారు. ప్రభుత్వ చేతగానితనం వల్లే ఇదంతా జరుగుతోంది. ఈ చేతగానితనం వల్లనే పాపలాంటి వారు ఏ తప్పు చేయకపోయినా నరకప్రాయ జీవితాలను గడుపుతున్నారు. వారిపై యాసిడ్ పోసిన దుండగులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ★

ఒక అంతరంగం...

లక్ష్మి

నాతో ఎంతో ప్రేమగా మాటాడే జానకమ్మ గారికి - నా మీద వళ్ళు మంటెక్కువని నాకెట్లా తెలుస్తుంది? నన్ను అస్తమానం విమర్శించే విమలక్కకి - నేనంటే వల్లమాలిన అభిమానమని ఎట్లా ఊహిస్తాను?

అందువల్ల -

నాకు వినిపించే మాటల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నా - నాక్కనిపించే చేష్టలకి మాత్రమే విలువ ఇవ్వడం అలవాటు చేసుకున్నా - నా బతుకు ముదనష్టమవుతుంది. నేను మాయదారి మబ్బుల్లో వుండిపోతాను!

మా తల్లి బంగారు తల్లి అని నన్నెవరైనా మెచ్చుకుంటే నేను పొంగిపోకూడదు. బంగారు తల్లి అని బిరుదిచ్చిన మనిషే - తన మనసులో ఇనపగజ్జల తల్లి అని తిట్టిపోసే ప్రమాదముంది. దానికేం చెబుతాను ?

అంచేత -

ఆహా ఓహో అని మనల్ని మబ్బుల్లో కూచోబెట్టే ఫీటుకి పడిపోడం కంటే - ఆ మనిషి గుండెల్లో మన బొమ్మ మనోహరంగా వెలుగుతుందో వికారంగా అఘోరించిందో తెలుసుకోడం ముఖ్యం!

అనేకమైన కారణాలతో మనల్ని అనేకమంది ఆహా ఓహోలతో అందలం ఎక్కించవచ్చు. ఆఫ్టరాల్ కాఫీపొడికోసం పక్కింటావిడ మనకి 'అన్నపూర్ణమ్మ' అని పేరు పెట్టి - మనతో అవసరం పడినప్పుడల్లా ఆ పేరుతో పలకరించవచ్చు. చేబదులు ఈజీగా దొరుకుతుందనే ఆశతో - అడిగిన వాళ్ళకి లేదనే దరిద్రం మనకి లేదుగాక లేదని పొగడొచ్చు!

అంతమాత్రాన -

ఆ పలకరింపులూ పొగడ్తలూ సమస్తం వాస్తవాలని నమ్మేస్తే మన దారి తిన్నగా మబ్బుల్లోకే గదా?

ఇతరులను ఆడిపోసుకోడమెందుకు?

నేను కూడా ఇతరుల్లో వుంటాను!

మీరంటే నాకు గిట్టదు. మిమ్మల్ని అపరకాళిగా ఎంచుకుంటాను. మీకు మంచీ మర్యాద తెలీదని స్వాభిప్రాయం. కేవలం మీ నోటితోనే జనాన్ని అదరగొడుతున్నారని తెలుసుకున్నాను!

అల్లాంటి మీతో నాకు పని పడినప్పుడు ఏం చేస్తాను? మీక్కూడా 'అన్నపూర్ణమ్మ'గారనే పేరు పెట్టి - మీతో అవసరం వచ్చినప్పుడల్లా ఆ పేరుతోనే మిమ్మల్ని పలకరిస్తాను. అడిగిన వాళ్ళకి లేదనే దరిద్రం మీకు లేదుగాక లేదని మిమ్మల్ని పొగుడుతాను!

ఈ పనే ఇతరులు నాకు చేస్తున్నప్పుడు -

నేనెందుకు గింజుకోవాలి ?

నాకైనా మీకైనా నిజాలు దాచుకు బతకడం రూలుగా పెట్టుకున్నాం. లేకపోతే సుఖంగా బతకలేం!

పచ్చినిజాలు అంతరంగంలో బతుకుతూ వుంటాయి!

పరమ అసత్యాలు నోటితో వినిపిస్తుంటాం!

అంతరంగాల్లో గూడుకట్టుకున్న అభిప్రాయాలు ఇతరులకు వినిపించవు. వాటిని వినగలిగే సౌకర్యం సమస్తమైన వారికీ వుంటేగింటే - జీవిత నాటకం సాఫీగా సాగదు. ఎక్కడకక్కడ బ్రేకులు పడిపోతూ వుంటాయి!

అంతరంగం తాలూకు విలువైన అభిప్రాయాలు సొంతదారునికి మాత్రమే వినిపిస్తాయి!

అప్పుడప్పుడు అవసరమొచ్చినపుడు అంతరంగమా అని ఆత్మీయంగా పిలుచుకుంటాను. నీతోనే వున్నానంటుంది అంతరంగం!

అంతేమరి -

నా అసలైన చిరునామా నా అంతరంగమే! పిడికెడు గుండెలో ఒదిగొదిగి కూర్చుంటుంది. అక్కడే కూచుని నా తప్పొప్పులను తనిఖీ చేస్తుంది!

నేనూ నా అంతరంగం కలిసే పుట్టేం. బాల్యమంతా కలిసే గడిపేం. అప్పట్లో మా ఇద్దరి మాటా ఒక్కటే. మా ఇద్దరి బాటా ఒక్కటే.

వయస్సు పెరుగుతున్న కొద్దీ... అనుభవాల తాకిడి ఎక్కువవుతున్న కొద్దీ నా అంతరంగంతో నాకు బేధాభిప్రాయాలు కూడా ఎక్కువుతూనే వున్నాయి!

అందువల్ల -

అవకాశం దొరికినప్పుడల్లా అంతరంగం నన్ను కోప్పడుతుంది. ఆ తర్వాత బుజ్జగిస్తుంది. ఒక్కో సందర్భంలో ఉగ్రరూపం దాల్చుతుంది. వెనువెంటనే శాంతిస్తుంది!

అంతరంగం ఘోషని రికార్డు చేస్తే ఎట్లా వుంటుంది!

ఎల్లా వుంటుందో ఒక నాటకంలో చూసేను, ఒక జంట వాళ్ళకి అయిదేళ్ళక్రితం పెళ్ళయినా అయిదు రోజుల క్రితమైనట్టు కనిపిస్తుంటారు!

వాళ్ళు ఏదో పని మీద పొరుగూరు వచ్చి ఒక హోటల్లో విడిది చేస్తారు. అదే హోటల్లో ఒక సైంటిస్టు కూడా దిగుతాడు!

ఆ సైంటిస్టు అగ్గిపెట్టె సైజులో వున్న ఒక పరికరాన్ని ఈ మధ్యనే తయారు చేసేడు. దానికి నథింగ్ బట్ ట్రూత్ అని పేరు పెడతాడు!

ఆ పరికరాన్ని ఎవరికీ తెలీకుండా ఆ హోటల్ లాంజ్‌లో వున్న కుర్చీకి తగిలిస్తాడు. ఆ కుర్చీలో ఎవరు కూచున్నా - ఆ పరికరం పవర్తో అన్నీ నిజాలే చెబుతారు. అంతా నిజమే చెబుతారు! అది రూలు!

ఈ నేపథ్యంలో-

సైంటిస్టుకి 'దంపతులు' పరిచయమవుతారు. మా వారు దేవుడు అంటుంది ఆమె. మా ఆవిడ దేవత అంటాడు అతను! వాళ్ళ అనుకూల దాంపత్యానికి సైంటిస్టు ముచ్చటపడతాడు!

ఆమెకి తెలీకుండా - అతన్ని ఆ మాయ కుర్చీమీద కూచోబెడతాడు సైంటిస్టు. కుర్చీకింద నథింగ్ బట్ ట్రూత్ పని చేయడం ప్రారంభిస్తుంది. దీని ప్రభావంతో అతనికి తెలీకుండా పచ్చినిజాలు చెప్పడం ప్రారంభిస్తాడు. అవి ఇట్లా వుంటాయి -

"మా పెళ్ళి పెద్దలు చేసిన పెళ్ళి. నా భార్యని ఇంతకుముందు ప్రేమించలేదు. ఇకముందు ప్రేమించను. మావ పెద్ద కంట్రాక్టరు. లక్షల్లో తడిసిపోతున్నాడు. ఒక్కగానొక్క కూతురు. వాళ్ళకి డబ్బుమదమెక్కువ. నాకు డబ్బు మీద మమకారం ఎక్కువ. అందుకే మా ఇద్దరికీ పెళ్ళయింది...

"అయిదు లక్షల కట్నంతో నా ప్రేమనీ నా జీవితాన్నీ చంపేసేరు. ఇదే హోటల్లో రూం నెంబరు త్రీనాట్‌త్రీలో నా లవ్ వుంది. పేరు రీటా. నా కోసమే ఈ హోటల్లో దిగింది. ఈ బ్లడీ పెళ్ళాం నాకు నా రీటాకి అడ్డంగా వుంది. లక్షల్తో మొగుడ్ని కొనుక్కున్నాననే ధీమా నా పెళ్లానికి. దాని తండ్రి కాలం చేస్తే లక్షలు సొంతమవుతాయనే ఆశనాకు..

"డబ్బింటి పిల్లగదా! అది చెప్పిందే వేదం. అది ఏడిస్తే ఏడవాలి. నవ్వితే నవ్వాలి. నా సొంతానికి ఏడవకూడదు. నవ్వకూడదు. పెళ్ళిలో సుఖం లేదు. ప్రేమించు. పెళ్ళొద్దు. ప్రేమిస్తూనే జీవించు..

- తర్వాత ఏమైందని అడక్కండి. అంతరంగం బాణీ ఏమిటో చెప్పేనేగాని పూర్తి కథ చెప్పడం నా ఉద్దేశం కాదు. అంచేత సెలవంటున్నాను! ★

రథయాత్ర రట్టు



రుక్మిణి

ఊరువూరంతా అలజడిగా వుంది. జనాలకు కాళ్ళు చేతులాడ్డం లేదు. వూరికే రావిచెట్టు దగ్గరకూ... గుడి దగ్గరకూ కాకుల్లా తిరుగుతున్నారు. అందరి గుండెల్లోనూ అదోరకమైన దిగులు.... ఉత్సుకత... ఏం జరగబోతోందోనని ఆందోళన. ఆరాటం! మరి కొందరు ఆడవాళ్ళయితే ఇంట్లో పొయిలు వెలిగించడం కూడా మరిచిపోయి వూరికే అందరిండ్లూ చుట్టివస్తున్నారు.

"అసలీ వూరికే ఏదో దాపురించిందిరా... కలికాలం... అయినా ఈరబ్రెమ్మంగారు ఏనాడో సెలవిచ్చారు. అయినా పోయేకాలం... అంతా కలిమహిమ!" ఓ ముసలి వేదాంతి చప్పిడి దవడలతో చుట్టపీకులు పీకి బండరాయిమీద కూచుని నన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు.

"ఓరినీ ఈరబ్రెమ్మం ఇరగబడిపోనూ.. అసలు ముందు జరగబోయే సంగతిని వదిలి పుచ్చు వేదాంతాలెందుకు? ఖబర్దార్!" జక్కులోడు మటమటమని ఈసడించుకున్నాడు.

చప్టామీద యాద్గిరి, మల్లేషు... తాగుబోతు గురివిగాడు ఇంకా మరికొందరు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సందులో సందుగా గురివిగాడికి కాస్తంత మాట్లాడే అవకాశం చిక్కింది.

"ఓరి పిచ్చి... కొడుకుల్లారా... అసలు మీ జలమలో ఏనుగును ఎపుడైనా చూసినార్రా? చూసినవాండ్లు ఎంతమంది? కరట్టుగా చెప్పండిరా.. ఛాలెంజ్ - అని తొడలు లపలప చరిచాడు.

"నేను 'అడివిరాముడు' సిన్మాలో చూసినా...!" మల్లేషు మరీ అమాయకంగా అన్నాడు. గురివిగాడు విషాదంగా నవ్వాడు-

"సిన్మా కాదురా ! నిజెం ఏనుగు... ఛాలెంజ్.. మరి మా తరం వాళ్ళం చూసినం.. అది అలియవార్ జంగ్ మీర్ జాఫర్ సర్కారు దొర మనూరికి పంపిచ్చిండు - ఇనండెసె.

ఇదేదో వింటానికి కాస్తంత సొంపుగానే వుందనుకుని అందరూ కూడబలుక్కుని వింటానికి సిద్ధపడిపోయినారు. గురివిగాడు తాపీగా కథ మొదలు పెట్టిండు.

"అబ్బో... ఆ రోజు నిజాంగారి పుట్టినరోజు... అట్టహాసం... హైదరాబాదు నిండా గుర్రాలు.. లొట్టిపిట్టలు.. ఏనుగులు... ఎంతయినా వారి ఏలుబడిలోని గ్రామం గదా - మా కరణం పటేలు వుండబట్టలేక బరబరమని నిజాం సర్కారు వారికి 'మావూరి జనాలకు ఏనుగును చూడాలని బహు కోరికగా వుందీ... ఒకటి ప్రసాదించండి' అని ఒక కాగితం గిలికి పంపించినాడు గదా.. ఇంకేముంది - తెల్లారేసరికి... అబ్బో.. ఏనుగంటే అదీ ఏనుగు... నిజాంగారు పంపించినారాయె! దాన్ని చూసి మా గుండెలవిసి పోయినాయంటే నమ్మండి! అది వచ్చీ రావటంతోనే ముందు రెండు తాటాకు గుడిసెలు భోజనం చేసింది - ఊరి బయట అయిదారు మామిడి చెట్లు.. రెండెకరాల వరిమడీ... దాని తిండికి అంతమే లేకపాయె! సరె.. దాన్ని తెచ్చి సావిట్లో నిలబెడితే చూడ్డానికి జనవే జనం... అబ్బో... అది ఒకసారి తొండం ఎత్తి ఘీంకరించేసరికి పాతికమంది జనం మూర్ఛపోయిరి!

అయితే మా కరణం పటేలు గారికి ఓ పెద్ద అనుమానం పట్టుకుంది. గింతలావు ఏనుగును వూరి మధ్యన నిలబెట్టి వుంచినం.... బాగానే వుంది. గంటకో చెట్టును ఫలహారం కింద లాగించేస్తుంది. బాగనే వుంది. మరి అదిగాని 'అపానవాయువు' వదిలితే ఈ వూరు మిగులుతుందా... జనం ఎన్ని కోసుల దూరం కొట్టుకుపోతారో... వారి పిల్లాపాపల సంగతేంటి? వూరి జనవందరూ ఆ తుపాన్లు దెబ్బకు ఎగిరిపోతే మరి వూరెట్టా? అని దొడ్డ ఆలోచన చేసి ఎందుకైనా మంచిదని దాన్ని జాగ్రత్తగా వూరిబయట చెరువు దగ్గరకు తరలించాం. ఎందుకంటే దాని వాయువు దెబ్బకు తెగితే కట్ట తెగిపోతుంది. అంతే! మళ్ళా కట్టుకోవచ్చు - అని వూరిజనం మొత్తం ఇళ్ళు వదిలేసి - చెవుల్లో గుడ్డలూ... దూదిపింజలూ నూక్కుని దానికి వందగజాల్లో బిక్కుబిక్కుమని కూలబడిపోయినం, ఎండబాగా మండిపోతుండె! కడుపులో ఆకలి.. అది నెమరు వేసుడే కాని 'వాయువు వదలదాయె! అయ్యా... సరిగ్గా మిట్టమధ్యాహ్నానికి అది ఓ ఘీంకరింపు ఘీంకరించి 'తుస్సు' మని వినపడీ వినవడనంత నన్నని ఈలవంటి శబ్దంతో గాలి వదిలి చల్లగా చెరువులో దిగి ఆటలకు తగులుకుంది-"

గురివిగాడి ఈ కథతో అక్కడి వాళ్ళందరికీ పెద్దగా నవ్వొచ్చింది. మరిపుడు 'రథయాత్ర' ఓటి వచ్చి పడిందాయె! సాక్షాత్తు ఉపప్రధాని అద్వాని గారు రథం... గుర్రం... బాణాలు... పటాటోపం...! ఈ దెబ్బకు అసలు ఈ వూరు ఆగుతుందా? జనం మిగులుతారా? ఇదేం లాభం లేదు. అసలు రథయాత్రని తట్టుకోవాలంటే మేళతాళాలతో ఊరిబయటనే ఆపి, దాని దెబ్బేమిటో తేల్చుకోవడం బెటరని అందరూ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చేశారు!

* * *

ఊరు వూరంతా వూరి బయట కిక్కిరిసిపోయింది. ముసలీ ముతకా... బీదా బిక్కీ... పిల్లా పీచూ... సందడే సందడి!

"అరె... అది రథంరా... దానికి పాతిక గుర్రాలు కట్టిలాగుతారు. మరి దాన్లో వచ్చే మహారాజెవడ్రా..." నక్కలోడు వినయంగా అడిగాడు.

"అద్వానంగారనీ పూర్తి రాముడే అనుకో.. ఈ దేశంలో ఆనాటి రాముడ్ని తిరిగి బతికిచ్చడానికి బాణం పట్టేసినాడు. బంగారు కిరీటం... బుజకీర్తులు... నోట్లో శంఖం... అన్నీ వరాలే వరాలు... అబ్బో...!" మంకడు మురిసిపోయాడు.

"మరి మన్లాంటోల్లకి అద్వాన్నంగారో... రాముడో వస్తే గింతంత గంజి నీళ్ళో... కాసిని మంచినీళ్ళో దొరుకుతాయన్నమాట!" వెంకమ్మ నొక్కుతూ అంది.

"ఓసి పిచ్చమొహాల్లారా... ఈ అయిదారేండ్ల బి.జె.పి. పాలనలో మందేశం ఎంతో ముందుకు పోయింది. రాముడివల్లా... అయోధ్యలో గుడికట్టడం వల్లా జనం గోచీలు ఎట్లా కట్టుకోవాల్నో అన్నీ నేర్పుతారన్నమాట!"

"మరినాకు గోచీ కూడా లేకపోతే చింకిబస్తా చుట్టుకున్నా.. కర్మ" అంతా కోలాహలం.. రథం వచ్చి ఆగేసరికి జనాలకు ఊపిరాగినంత పనయింది. జనాలు చెవులు రిక్కరించి అద్వానంగారు ఏం వూదుతారో.. ఏం వదిలితే తామెంతదూరం వురకాలో అని రెడీ అయిపోతున్నారు.

"హిందూ ప్రజలారా... 'దేశం సుభిక్షం' అంటూ అతిగా వాగడం వల్ల లాభం లేదు. అవతల చైనా మనకన్నా ముందుకు పోతుంది - నేను చెప్పేదేమీ లేదు. అంతా రాముడి దయ - రేపు అయోధ్యలో రామమందిరం కడితే మీ గోచీలన్నీ వూడిపోతాయని స్పష్టంగా చెప్పగలను. రాముడి రాజ్యం కావాలంటే మళ్లీ మనం మ్లేచ్ఛుల పని పట్టాలె - మన అటల్‌గారి ఆధ్వర్యంలో భారత్ భగభగా వెలిగిపోతుంది - ఇంతే నేను చెప్పదలుచుకున్నది-!"

నోళ్ళు వెళ్ళబెట్టడం జనం వంతయింది.! ★

నిర్లక్ష్యమే అంధత్వానికి దారి తీస్తోంది



"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అని అందరికీ తెలిసిందే. కారణాలు ఏవైనా ఏటా అంధత్వాన్ని ఆపాదించుకుంటున్న వారి సంఖ్య తెలుసుకుంటే ఒకింత మనస్తాపం కలుగకమానదు. రోడ్డు, కర్మాగారాల్లో ప్రమాదాలతో పాటు, ఇంకా చిన్నా చితకా కంటికి తగిలే దెబ్బలు, గాయాలు, వ్యాధులను పక్కన పెట్టినా, కేవలం కాటరాక్ట్ (శుక్లాలు) కారణంగానే మన దేశంలో నేటికి **1.2**కోట్ల మంది అంధత్వంతో జీవితం వెళ్ళబుచ్చుతున్నారు. వీరికి ఏటా కొత్తగా **20** లక్షల మంది తోడవుతున్నారు. వీరిలో ఏటా **16** లక్షల మందికి మాత్రమే కాటరాక్ట్ ఆపరేషన్‌లు నిర్వహించి చూపు ఇవ్వగలుగుతున్నారు. జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ'లను ఏర్పాటు చేయడం కూడా జరిగింది. మరోవైపు నేత్రవైద్య, శస్త్ర చికిత్సా రంగాలలో ఎంతో అభివృద్ధి కూడా చోటు చేసుకున్నది. ఫలితంగా కార్నియల్ ట్రాన్స్ ప్లాంకెరటాటమి, ఇంట్రాక్యులర్ లెన్స్‌లు, లేజర్ చికిత్సలు అందుబాటులోకి వచ్చి ఎంతోమంది రోగుల్ని అంధత్వం నుండి బయటపడేస్తున్నాయి. ముందు జాగ్రత్తల ద్వారా కంటిని రక్షించుకుంటూ, వ్యాధుల విషయంలో కాస్తంత శ్రద్ధ చూపితే ఎంతోమందిని అంధత్వం నుండి రక్షించడం పెద్ద కష్టతరం కాబోదు అంటున్నారు. నేత్ర వైద్య నిపుణులు. అందుకు కావాల్సింది ప్రజాచైతన్యమే. కాని నేడు చాలా మంది కంటి విషయంలో ఎంతో అశ్రద్ధ చూపుతున్నారనేది సత్యదూరం కాబోదు. అందుకు అంధుల సంఖ్యే నిదర్శనం.

డాక్టర్ బెల్లంకొండ మస్తాన్

◆ "ఆప్తాల్‌మాలజి" అంటే ఏమిటి ? దీని పుట్టు పూర్వోత్తరాలేమిటి ?

కంటి నిర్మాణం, వ్యాధులు-చికిత్సలకు సంబంధించిన అధ్యయన శాస్త్రాన్ని స్థూలంగా అప్తాల్‌మాలజిగా పేర్కొనవచ్చు. ఇక దీని పుట్టుపూర్వోత్తరాల విషయానికి వస్తే 1970 ప్రాంతం దాకా జనరల్ సర్జరీలో భాగంగా వుండేది. 1944లోనే రిడ్లీ అనే శాస్త్రవేత్త "ఇంట్రా అక్యులర్ లెన్స్" కనుగొన్నా, గత ఇరవై సంవత్సరాల నుండే ఆప్తాల్‌మాలజి వేగవృద్ధిని అందుకుని ప్రత్యేక విభాగంగా ఎదిగింది. క్రయోసర్జరీ, మైక్రో సర్జరీ, లేజర్‌లను ఉపయోగించడం, కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇంట్రాక్యులర్ లెన్స్‌ల వినియోగం మొదలైనవి ఈ విభాగంలో మైలు రాళ్ళుగా పేర్కొనవచ్చు.

◆ కంటి నిర్మాణం గురించి స్థూలంగా తెలియచేస్తారా ?

కన్ను పుర్రెలోని ఆర్బిట్‌లో అమరి ఉంటుంది. ఒక్కో కన్ను అయిదు సి.సి.ల ఘనపరిమాణాన్ని, అయిదు గ్రాముల బరువును కలిగి ఉంటుంది. గోళాకారంలో కనిపించే కంటిలో, వెలుపలి నుండి లోపలికి, మధ్యలో (సెంట్రల్‌గా) నల్లగా కనిపించే భాగాన్ని కార్నియా అంటారు. దీన్ని చుట్టి కంజెంక్టివా, స్క్లీరాలు ఉంటాయి. కార్నియా వెనుక భాగంలో వున్న ద్రవంతో కూడిన భాగాన్ని ఏంటీరియర్ ఛాంబర్ అంటారు. దీని తర్వాత నేత్ర విభాగము లేదా ఐరిస్ ఉంటుంది. దీనిలో గల రంధ్రాన్నే కంటిపాప లేదా "ప్యూపిల్" అంటారు. ఐరిస్ వెనుక భాగంలో పోస్టీరియర్ ఛాంబర్ ఉంటుంది. దీని వెనుక ఇడ్లీ ఆకారంలో గల కంటి కటకము అనగా 'లెన్స్' అమరి ఉంటుంది. దీని వెనుక విట్రియస్ అనే పదార్థం, రెటీనా ఉంటాయి. రెటీనా నుండి నేత్ర నాడులు ప్రారంభమవుతాయి. ఇవి మెదడుతో అనుసంధానము, 'దృష్టి'లో ప్రధాన పాత్ర వహిస్తాయి. కంటిరెప్పలు కంటికి రక్షణ కల్పిస్తుంటాయి.

◆ సాధారణ కంటి సంబంధ వ్యాధులేమిటి ?

సాధారణ కంటి వ్యాధులలో వైరస్ లేదా బాక్టీరియల్ కంజెంక్లివేటిస్, దృష్టి లోపాలు, కార్నియల్ ఒపాసిటిస్, గ్లకోమా (నీటికాసుల వ్యాధి), ట్రాకోమా, శుక్లాలు, విటమిన్ లోప వ్యాధులు, ముఖ్యంగా విటమిన్ ఎ లోపం కారణంగా వచ్చే రేచీకటి, టెరీజియం (కొయ్యకండ పెరగడం) రెటీనల్ డిటాచ్‌మెంట్, కలర్ బ్లైండ్‌నెస్, కంటిలో నలకలు పడడం, గాయాలు అవటం, కంటిలో వచ్చే క్యాన్సర్, పుట్టుకతో వచ్చే కంటి నిర్మాణ సంబంధ లోపాలు, వ్యాధులు, డయాబెటిస్, రక్తపోటు కారణంగా కంటికి వచ్చే వ్యాధులు పేర్కొనదగినవి.

◆ పుట్టుకతో వచ్చే కంటి నిర్మాణ సంబంధ లోపాలను, వ్యాధులను గురించి తెలియజేస్తారా ?

శిశువు, తల్లిగర్భంలో పెరుగుతున్నప్పుడు సాధారణ కంటి పెరుగుదలలో ఏ కారణం చేతనైన అసాధారణత చోటు చేసుకుంటే కంటి నిర్మాణ లోపాలు కనబడడం జరుగుతుంది. కొన్ని కంటి సంబంధ వ్యాధులు తల్లిదండ్రుల నుండి వంశపారంపర్యంగా బిడ్డలకు

వస్తుంటాయి. నిర్మాణ సంబంధ లోపం వ్యాధుల్లో మెల్లకన్ను, మయోపియా, పుట్టుకతోనే శుక్లాలు, నీటికాసుల వ్యాధులు, కన్ను చాలా పెద్దదిగా ఉండడం (మాక్రోఫ్తాల్మస్) లేదా చాలా చిన్నదిగా ఉండడం (మైక్రోఫ్తాల్మస్) మొదలైనవి. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధుల్లో, మెల్లకన్ను, పిల్లికన్ను, క్యాన్సర్, వర్ణ అంధత్వం (కలర్ బ్లైండ్‌నెస్), బ్లూస్కీరీ, బుప్తాల్మస్, రెటినెటిస్ పిగ్‌మెంటోసా, ఆప్టిక్ ఎట్రోపి మొదలైనవి పేర్కొనదగినవి.

◆ 'కంజెంక్టివైటిస్' అంటే ఏమిటి? దీని గురించి వివరంగా తెలియజేస్తారా ?

కంటిలోని కంజెక్టివా ఇన్ఫెక్షన్స్‌కు గురి కావడాన్నే 'కంజెంక్టివైటిస్' లేదా కళ్ళకలక' అంటారు. వ్యాధి సోకడం వలన రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. అందువలన రక్తసరఫరా పెరిగి కన్ను ఎర్రబడుతుంది. కళ్ళ కలకలో ఎన్నో రకాలు వున్నాయి. ఏ రకమైన కళ్ళ కలక అయినప్పటికీ కన్ను ఎరుపెక్కడం, నీరు కారడం, వెలుతురును చూడలేకపోవడం అంటే ఫొటో ఫోబియా మొదలైన లక్షణాలు ఉంటాయి. వైరస్ కళ్ళ కలకకు ప్రత్యేకమైన చికిత్స ఏమీ లేదు. ఈ రకం కళ్ళ కలకకు వేగంగా ఒకసారి ఆయా రకాన్ని బట్టి మందులు వాడాల్సి ఉంటుంది. ఏది ఏమైనా కళ్ళకలక అంటువ్యాధి. ఇతరులకు సోకకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రోగి వాడే టవల్స్, సబ్బు, కాటుక, జేబురుమాలు వంటివి ఇతరులు వాడకూడదు. చల్లని పరిశుభ్రమైన నీటితో కళ్ళు శుభ్రం చేసుకుంటుండాలి. కళ్ళకు బాండేజి వేయకూడదు. వైద్యుని సంప్రదించడం ఎంతైనా శ్రేయస్కరం.

◆ 'అప్తాల్మియానియోనేటారం' అంటే ఏమిటి? దీని గురించి స్థూలంగా తెలుపుతారా?

సాధారణంగా బిడ్డపుట్టిన రెండు మూడు వారాల దాకా కంటి నుండి ఎలాంటి ద్రవాలు కనిపించవు. అందుకు కారణం ఆ దశలో కన్నీటి గ్రంధులు బాగా వృద్ధి చెంది ఉండకపోవడమే. కనుక బిడ్డ పుట్టిన నెల రోజులలో కంటి వెంబడి నీరు కారుట, ఎర్రబడుట, పుసికట్టుట వంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. అది బాక్టీరియా వలన వస్తుంది. ఈ బాక్టీరియా శిశువు కంటిలోకి ప్రసవం సమయంలో తల్లి జననేంద్రియాల ద్వారా చేరుతుంది. మొదటి వారంలోనే లక్షణాలు బయటపడుతుంది. కనురెప్పలు వాయడం, కళ్ళు ఎర్రబడటం, చాలా ఎక్కువగా పుసులు కట్టటం, కళ్ళు తెరవడమే కష్టమవుతుంది. దీనినే 'అప్తాల్మియా నియోనేటారం' అంటారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అసలు వ్యాధి సోకకుండా ఉండాలంటే తల్లి జననేంద్రియాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రసవించేలా చూడాలి. బిడ్డపుట్టగానే కళ్ళను గోరువెచ్చటి నీటితో పూర్తిగా తుడవాలి. వైద్యుని సలహా మేరకు యాంటిబయాటిక్ డ్రాప్స్ వేయడం ఎంతైనా మంచిది.

◆ సాధారణ దృష్టిలోపాల గురించి వివరిస్తారా ?

సాధారణ దృష్టి లోపాలలో దూరదృష్టి, హ్రస్వదృష్టి, ఎనిసోమెట్రోపియా, ప్రెస్బయోపియా మొదలైనవి పేర్కొనదగినవి. దూరంగా వున్న వస్తువులు స్పష్టంగా కనిపించి, దగ్గరగా ఉన్న వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడాన్నే దూరదృష్టి అంటారు. అలానే దగ్గర వున్న వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడం వలన వచ్చే దృష్టి లోపాన్ని ఎనిసోమెట్రోపియా అని, వయస్సు మీద పడిన వారిలో కంటిలోని కటకంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వచ్చే దృష్టికి రేడియల్ కెరటాటమి అనే శస్త్ర చికిత్స లభ్యమవుతున్నది.

◆ విటమిన్'ఏ' లోపానికి, కంటికి గల సంబంధం ఏమిటి?

విటమిన్ 'ఎ' లోపం వల్ల 'రేచీకటి' వ్యాధి వస్తుంది. అంటే రాత్రుళ్ళు కళ్ళు కనిపించవు. కంటిలోని నాడి పొరలలో రాడ్స్ అనే నిర్మాణాలు ఉంటాయి. ఇవి రాత్రిపూట దృష్టిలో ప్రధాన పాత్ర వహిస్తాయి. ఇవి పనిచేయడానికి రోడాప్సిన్ అనే రసాయనం అవసరమవుతుంది. ఈ రసాయనం తయారీకి విటమిన్ ఎ చాలా అవసరం. విటమిన్ ఎ లోపించిన వారిలో రేచీకటి ఏర్పడుతుంది. రోగులకు తగిన మోతాదులో విటమిన్ ఎ అవసరాన్ని బట్టి ఇంజక్షన్ రూపంలో నోట్లో వేసే చుక్కల రూపంలో, ఆహారం రూపంలో అందించడం ద్వారా లోపాన్ని సరిదిద్దవచ్చు. విటమిన్ ఎ లోపాన్ని అశ్రద్ధ చేస్తే కార్నియా కూడా దెబ్బతిని పూర్తిగా అంధత్వానికి గురి చేసే ప్రమాదం లేకపోలేదు.



కనుక ముఖ్యంగా పిల్లల్లో విటమిన్ ఎ లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి సరిదిద్దడం ఎంతైనా మంచిది. ప్రస్తుతం మన దేశంలో విటమిన్ ఎ లోపం కారణంగా అంధులవుతున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు.

◆ నేత్ర వైద్యుల్ని సంప్రదించకుండానే కొందరు వివిధ రంగుల కళ్ళజోళ్లను వాడుతుంటారు. వీటిని వాడడం వలన నష్టాలేమైనా ఉన్నాయా?

ఎలాంటి కళ్ళజోళ్ళు అయినా నేత్ర వైద్యుని సంప్రదించకుండా వాడడం అంత శ్రేయస్కరం కాదు. వ్యక్తులకు దృష్టి లోపాలుంటే సాధారణంగా వాడే జీరో పవర్ గ్లాసుల వలన సమస్యలు ఏర్పడవచ్చు.

◆ కలర్ బ్లైండ్‌నెస్ అంటే ఏమిటి, ఎలా వస్తుంది? నిరోధించే వీలున్నదా?

ఎరుపు, నీలం, ఆకుపచ్చ, ప్రాథమిక రంగులలో మూడు రంగులను కాని, ఏదో ఒక రంగును కాని గుర్తించలేకపోవడాన్నే కలర్ బ్లైండ్‌నెస్ అంటారు. మూడురంగుల బ్లైండ్‌నెస్ చాలా అరుదు. సాధారణంగా ఎరుపు రంగు బ్లైండ్‌నెస్ ఎక్కువగా కనిపిస్తుంది. వివిధ వర్ణాలను విశ్లేషించే, నాడి పొరలోని కోన్స్ విధి విఫలం వల్ల వర్ణ దృష్టిలోపం ఏర్పడుతుంది. ఈ వ్యాధి పుట్టుకతోనే వంశపారంపర్యంగా వస్తుంది. పురుషులలోనే కనిపిస్తుంది. స్త్రీలు వాహకులుగా పని చేస్తారు. కలర్ బ్లైండ్‌నెస్‌కు ప్రత్యేక చికిత్సలు ఏమీ లేవు. వివాహితులలో జెనెటిక్స్ కౌన్సిలింగ్ ఉపయోగించవచ్చు.

◆ డయాబెటిస్, రక్తపోటు అంధత్వానికి ఎలా దారి తీస్తాయి ?

అదుపులో ఉంచుకోకపోతే డయాబెటిస్, రక్తపోటు, కంటిలోని రెటీనాపై ప్రభావం చూపి అంటే ఫండస్‌పై ప్రభావం చూపి అసాధారణతకు గురి చేస్తాయి. ఫండస్‌లోని ఈ అసాధారణత అంటే రెటినల్ మార్పులు ఎంతకాలం నుండి రక్తపోటు, షుగర్ వ్యాధి వున్నాయనే అంశం మీద ఆధారపడి వుంటాయి. రక్తపోటును, షుగర్ వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టుకోవడం ద్వారా రెటినల్ మార్పులను పూర్తిగా నిరోధించవచ్చు. రెటీనాలో మార్పులు వచ్చిన తర్వాత పెద్దగా చేయగలిగింది లేదు.

◆ కంటి వ్యాధులు చికిత్సలో 'లేజర్' ఎలా ఉపయోగపడుతుంది ?

కంటి వ్యాధుల చికిత్సలో 'లేజర్'కు నేడు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా కొన్ని వ్యాధులలో శస్త్ర చికిత్సలకు ప్రత్యామ్నాయంగా లేజర్‌ను ఉపయోగించడం జరుగుతున్నది. గ్లకోమా చికిత్సలోను, కాటరాక్ట్ చికిత్సలోను, మధుమేహం కారణంగా రెటీనాలో వచ్చిన మార్పుల కారణంగా చికిత్సలోను, హ్రస్వదృష్టికి శస్త్రచికిత్సలోను లేజర్ ఎంతగానో దోహదపడుతుంది. నిజానికి లేజర్ అనేది ఒక ప్రత్యేక కాంతి కిరణం. అత్యంత శక్తివంతమైన ఈ కాంతికిరణం దేన్నైనా ఛేదించుకొని పోగలదు. ఈ లేజర్‌లోను ఎన్నో రకాలు ఉన్నాయి. వాటిలో యాగ్ లేజర్, ఆర్గాన్ లేజర్, ఎగిమెర్ లేజర్, జినాన్ లేజర్, క్రిప్టాన్ లేజర్లు పేర్కొనదగినవి. లేజర్ చికిత్స వల్ల రోగికి అనేక లాభాలున్నాయి. హాస్పటల్‌లో ఉండనక్కర్లేదు. మందులు, శస్త్రచికిత్స వీలుపడినా వాటిలో కూడా లేజర్ చికిత్స ఉపయోగపడుతుంది. చాలా తక్కువ వ్యవధిలో చాలా కచ్చితంగా పనిని నిర్వర్తించవచ్చు.

◆ కంటిలో నలకలు పడినా, గాయాలు అయినా చేయాల్సిన ప్రథమ చికిత్స లేమిటి? అంధత్వాన్ని నిరోధించే మార్గాలేమిటి ?

కంటిలో నలకలు పడినప్పుడు కంటిని నలపకూడదు. చల్లని నీటితో శుభ్రం చేయవచ్చు. అయినప్పటికీ నలకలు పోకపోతే, నాటు, మోటు వైద్యులను ఆశ్రయించకుండా వైద్యుని సంప్రదించాలి. కంటిలో నలకలు (ఫారిన్ బాడీస్) తీసివేసేందుకు ప్రత్యేక సూక్ష్మ పరికరాలు వైద్యుల దగ్గర ఉంటాయి. గాయాలు అయినప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించాలి. కంటిలో ఏ భాగం ఏ మాత్రం దెబ్బతిందో పరీక్ష చేయించుకొని చికిత్స పొందాలి. గాయాలను నిర్లక్ష్యం చేస్తే అసలు కంటికే మోసం రావచ్చు. అంధత్వ నిరోధక విషయాలకు వస్తే ముందు ప్రతి ఒక్కరూ అక్షరాస్యులై కంటి విషయంలో ఒక అవగాహన కలిగి వుండాలి. కంటిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయక వెంటనే వైద్యుని సంప్రదించాలి. వాహనచోదకులు, కర్మాగారాల్లో పని చేసే వారు, కళ్ళకు ప్రొటెక్టివ్, గ్లాసులను వాడాలి. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులు, వాటిని పూర్తిగా అదుపులో ఉంచుకోవాలి. ప్రభుత్వం వైద్యులు అంధత్వ నిర్మూలనకు చేస్తున్న కృషిలో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాలుపంచుకోవాలి. ప్రజా చైతన్య కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొనాలి. ప్రజలు కూడా కళ్ళుంటేనే కలియుగమన్న వాస్తవాన్ని గుర్తెరగాలి. అప్పుడే అంధులు తగ్గిపోతారు. అంధత్వం అంతరిస్తుంది. ★

పుస్తక పరిచయం

ఉదాత్త కాంక్షలు - ఊహాత్మక సూచనలు

ఎన్నికల తరుణంలో రాజకీయ పార్టీలు ప్రణాళికలు విడుదల చేస్తాయి. మిశ్రమ సంఘటనలైతే ఎజెండాలు, కనీస కార్యక్రమాలు ప్రకటిస్తాయి. ఇందులో చెప్పేవి, దాచేవి కూడా వుంటాయి. ప్రణాళికల్లో ప్రజలకు చాలా వాగ్దానాలు చేస్తాయి కాని వాటిని తర్వాత పట్టించుకోవు. అధికారానికి రావాలనే ఏకైక లక్ష్యంతో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించే ఇలాటి పోకడల వల్ల పాలకవర్గ పార్టీల ప్రణాళికలు విలువ కోల్పోయాయి. ఈ నేపథ్యంలో మనస్తత్వ రచయిత, పాత్రికేయుడు, విశ్లేషకుడు సి.నరసింహారావు 'ప్రజల మ్యానిఫెస్టో' పేరిట విమర్శలు, సూచనలతో ఈ రచన చేశారు. రాజకీయ చింతనలో బుద్ధిజీవుల ప్రమేయం పెరగడం ఆహ్వానించవలసిన విషయం..

గవర్నర్ పదవి రద్దు, ఉపాధికి ప్రాధాన్యత, బంజరు భూములు, అటవీ భూముల పంపకం, గృహవసతికి ప్రాధాన్యత, పోలీసు వ్యవస్థ ప్రక్షాళన, తెలుగుకు అగ్రస్థానం, న్యాయ సంస్కరణలు, కార్పొరేట్ పన్నుల హెచ్చింపు, ప్రాజెక్టులకు ప్రాధాన్యత, నేరస్థ రాజకీయాల నిరోధం, ప్రజారోగ్యం, అధికార వికేంద్రీకరణ వగైరా విషయాల్లో నరసింహారావు చేసిన సూచనలు, పరిశీలనలు వాస్తవికంగా వున్నాయి. కుల వ్యవస్థను నిర్మూలించాలని కోరుకోవడం కూడా హర్షణీయమైంది. విద్యారంగం, రాజ్యాంగ సవరణలు పదేళ్ళకోసారి చేయడం తదితర అంశాల్లో చెప్పినవి లోతైన పరిశీలనకు నిలిచేవిగా లేవు. టూరిజం, కంప్యూటర్లు, సర్వీసురంగం వంటివి దాదాపు ఇప్పుడు సాధారణంగా వినిపించే విషయాలే.

నరసింహారావు పరిశీలనల్లో లోపాలు, పొరబాట్లు కూడా వున్నాయి. ముఖ్యంగా ఆయన దేశంలో అన్ని రాజకీయ పార్టీలను ఒకే గాట కట్టి ఆలోచించడం సమంజసంగా లేదు. ఏమైనా రాజకీయ పార్టీలంటేనే చీదరించుకోవడం వాస్తవంలో అమితంగా చీదరించుకోవలసిన పార్టీలను, నేతలను మరుగువరచడానికే సహాయవడుతుంది. వామపక్షేతరపార్టీలన్నీ అధికారమే పరమావధిగా వ్యవహరించే మాట నిజమే అయినా ఆయన వాటిని



ప్రజల మేనిఫెస్టో
రచన : సి.నరసింహారావు
వెల : రు.50/-
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్,
విశాలాంధ్ర బుక్‌హౌస్
అన్ని బ్రాంచీలు

కూడా (వ్యక్తిగత నాయకత్వం వుండదనే విషయంలో తప్ప) ఈ కోవలోనే కలిపేసి అందరినీ అభిశంసిస్తారు. ఈ క్రమంలో వాస్తవాలను కూడ నిర్ధారించుకోలేదు.

రచయిత ప్రపంచీకరణ, మతోన్మాదం ప్రమాదాలను దాదాపు గుర్తించ లేదు. ప్రపంచ బ్యాంకులో అత్యున్నత స్థాయి అధికారులుగా పని చేసిన స్టిగ్లిజ్, ఫిర్లిత్ వంటివారే దాని దుష్ఫలితాలను గర్హిస్తుండగా ప్రపంచీకరణ వల్ల కలిగే అవకాశాలను ఉపయోగించుకోవడం లేదని విచారించారు. ఈ రచనలో ఎక్కడా అంతర్జాతీయ దృష్టి కనిపించదు. ప్రభుత్వంలో, ప్రభుత్వ రంగంలో కొన్ని అవాంఛనీయ లక్షణాలనే ప్రముఖంగా చెబుతూ ఇక ప్రభుత్వం కీలకస్థానం నుంచి తప్పుకుని ఫెసిలిటేటర్‌గా మిగిలిపోవాలని ప్రతిపాదిస్తారు. అదే జరిగితే అప్పుడు ఇక ప్రణాళికల అవసరమే వుండదు. ప్రైవేటీకరణ క్రమంలోనూ అనేక అక్రమాలు దొర్లుతున్నాయని ప్రస్తావించే రచయిత అది యాధృచ్ఛికం కాదని, అసలు టోకున అవినీతిని పెంచేది కార్పొరేట్ తిమింగళాలేనని ఎందుకు గుర్తించరు? రిజర్వేషన్ల విషయంలో కూడా ఆయనకు రిజర్వేషన్లు వున్నాయి. ఎస్‌సిల విషయంలో అటూ ఇటూ మాట్లాడినా ఎస్‌టి ల దగ్గరకొచ్చే సరికి వారికి ఎలాటి రక్షణలు వుండకూడదని, అక్కడ భూములు బదలాయింపునుమతించాలని చెప్తేస్తారు. ఇవన్నీ ప్రజల జీవితానుభవాలతో పొసిగేవి కావు. సిద్ధాంతం, తాత్వికత అవసరమంటూనే నరసింహారావు మార్క్సిజానికి కాలం చెల్లిందని, ఇప్పుడు సిద్ధాంత శూన్యత ఏర్పడిందని చెప్పడం కూడా వాస్తవానుభవానికి అనుగుణంగా లేదు. ప్రపంచీకరణ పెనుతాకిడిలో ప్రతిఘటనకు ప్రాతిపదిక సమకూరుస్తున్నది మార్క్సిజమే.

యథాతథ స్థితిని కాపాడకూడదంటూ కొన్న మంచి సూచనలు చేసే రచయిత మౌలికంగా దాన్ని కాపాడే ఊహాత్మక పరిష్కారాలకు పరిమితమవడం విచారం కలిగిస్తుంది. ఎన్నికల ప్రాంగణంలో వివిధ తరగతుల వారి ఆలోచనాధోరణులు ఎలా వున్నాయో అర్థమవడానికి, అంతకంటే కూడా ప్రస్తుత వ్యవస్థలో పేరుకుపోయిన దుర్లక్షణాలను తెలుసుకోవడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. దీనికి లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ ముందుమాట రాశారు.

- తెలకపల్లి రవి

స్వీకారం



వలస బతుకులు
రచన : పెద్దింటి అశోక్ కుమార్
వెల : రు.30/-
ప్రచురణ : విశాల సాహిత్య అకాడమీ
2-2-186/53/5, రామకృష్ణనగర్,
బాగ్అంబర్‌పేట్, హైదరాబాద్

విశాల సాహితి
బహుజన తత్వాలు బీసీ, ఎస్సీల పాటలు
సంపాదకులు : బి.ఎస్.రాములు
వెల : రు.75/-
ప్రచురణ : విశాల సాహిత్య అకాడమీ
2-2-186/53/5, రామకృష్ణనగర్,
బాగ్అంబర్‌పేట్, హైదరాబాద్



Shakuni Mama Politics
Price : Rs. 10/- **For Copies :** Prajasakti Book House, Chikkadapalli, Hyderabad


భైరవకొండ

టూరిస్ట్‌గైడ్

మౌర్యులు ఏలిన జిల్లా ప్రకాశం

శేషు

క్రీస్తుపూర్వం 3వ శతాబ్దంలో మగధరాజ్యాన్ని ఏలిన మౌర్యులు ఈ జిల్లావరకు విస్తరించారు. ప్రకాశం జిల్లా చరిత్ర చూస్తే శాతవాహనులు, ఇక్ష్వాకులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహీలు, మొగలాయిలు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. శాతవాహనుల కాలంలో బౌద్ధం విలసిల్లిన సాక్ష్యంగా ఇక్కడ అనేక ఆధారాలున్నాయి. అదేవిధంగా ప్రాచీన హిందూ ఆలయాలు, విదేశీ వాణిజ్యానికి తోడ్పడిన ఓడరేవులు, అందమైన సముద్రతీరాలు, చిక్కని అడవులు ఎన్నో ఈ జిల్లాకు వన్నె తెచ్చాయి.

జిల్లా రాజధాని ఒంగోలు పట్టణానికి కూడా చాలా ప్రాచీన చరిత్ర ఉంది. 3,4 శతాబ్దాల నాటి పల్లవ రాజుల శిలాశాసనాల్లో ఒంగోలు పట్టణ ప్రస్తావన ఉంది. ఒంగోలు గిత్త పేరుతో ఇక్కడి ఎద్దులు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయం, దగ్గర్లోనే గల కొత్తపట్నం బీచ్ చూడదగ్గ ప్రదేశాలు.

చందవరం బౌద్ధస్థూపం

ఒంగోలు పట్టణానికి 75 కిలోమీటర్ల దూరంలో గల చందవరం వద్ద గుండ్లకమ్మ నదీ తీరాన ఒక కొండపై బయటపడిన బౌద్ధస్థూపం చాలా అపురూపమైనది. ఇటువంటిది దక్షిణభారతదేశంలో ఇది ఒక్కటేనని చరిత్రకారులు చెబుతున్నారు. ఇదే తరహాలోని స్థూపం తక్షశిల (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) లో మాత్రమే ఉందని అంటారు. ఈ స్థూపం పక్కనే గల మ్యూజియంలో అక్కడ దొరికిన పురాతత్వ వస్తువులను భద్రపరిచారు. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దం నాటి బ్రాహ్మి లిపిలో ఉన్న పత్రం కూడా అక్కడ దొరికింది.

మార్కాపురం

ఒంగోలుకు 94 కిలోమీటర్ల దూరంలో గల మార్కాపురం పలకలు, బలపాలు దేశం నలుమూలలకు ఎగుమతి అవుతాయి. గుండ్లకమ్మ నదీ తీరాన గల ఈ పట్టణంలో ఉత్పతి అయ్యే పలకలు దేశంలోని 80 శాతం అవసరాలు తీర్చుతున్నాయి. ఆరు వందల ఏళ్ళ క్రితం విజయనగరం రాజులు నిర్మించిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ఇక్కడ చాలా ప్రసిద్ధి చెందింది. 40 స్తంభాల మండపం వాటిపై చెక్కిన వివిధ దేవతామూర్తుల బొమ్మలతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ ఆలయంలో ప్రత్యేకంగా నిర్మించిన కిటికీల ద్వారా ప్రసరించే ప్రభాతభానుని కిరణాలు ప్రతి


చందవరం బౌద్ధ స్థూపం

ఏటా డిసెంబర్ 16 నుండి జనవరి 14వ తేదీ వరకు చెన్నకేశవుని పాదాలను తాకుతాయి. నాటి శిల్పుల మేధోసంపత్తికి ఈ ఏర్పాటు దర్పణం పడుతుంది.

వాడరేవు

చేనేతకు ప్రసిద్ధి చెందిన చీరాల పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో గల వాడరేవు బీచ్ వారాంతపు సెలవుల్లో, పండుగ దినాల్లో పెద్ద పిక్నిక్ కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. వాడరేవుకు ఆరు కిలోమీటర్ల దూరంలో రామాపురం తీరాన్ని కూడా అందమైన బీచ్‌గా తీర్చిదిద్దుతున్నారు.

మోటుపల్లి

ఒంగోలుకు 45 కిలోమీటర్ల దూరంలోని మోటుపల్లి రేవు రెండు వేల సంవత్సరాల క్రితమే పెద్ద వాణిజ్యకేంద్రంగా, ఓడరేవుగా వాసికెక్కింది. క్రీస్తుశకం 1వ శతాబ్దం నుండి ఈ ప్రాంతాన్ని ఏలిన రాజులు విదేశాలకు, దేశంలోని ఇతర తీరప్రాంతాలకు వాణిజ్యాన్ని ఈ రేవు ద్వారా నిర్వహించేవారు. ఇక్కడ అనేక బౌద్ధస్థూపాలతో పాటు రామాలయం కూడా ఉంది.

భైరవకొండ

ఒంగోలుకు 150 కిలోమీటర్లు, కనిగిరికి 64 కిలోమీటర్ల దూరంలో గల భైరవకొండ శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఏడవ శతాబ్దం నాడు కొండరాళ్ళ లోనే శివుడు ఇతర హిందూ దేవతలను మలిచిన ఈ ఆలయం అద్భుత శిల్పకళకు నిలయం. ఇక్కడి కళాకృతులు పల్లవుల కాలం నాటివిగా కనిపిస్తున్నా, తమిళనాడును ఏలిన రాజుల ప్రభావం కూడా కనిపిస్తుంది. సింగరాయకొండలో 15వ శతాబ్దం నాటి లక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ప్రతిఏటా జూన్ మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరవుతారు. అదేవిధంగా త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం కూడా ప్రాచీనమైనదే. ★


వాడరేవు బీచ్

కళాసాహితి

శ్రీకృష్ణ పారిజాత నృత్యరూపంలో పద్మశ్రీ శోభానాయుడు

కమనీయం

'సిద్ధేంద్ర భారతీయం'

అఖిల భారత కూచిపూడి నాట్య కళా మండలి ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు జరిగిన 'సిద్ధేంద్ర భారతీయం' కమనీయంగా సాగింది. తెలుగువారి సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపమైన కూచిపూడి నృత్యం జన్మస్థలమైన కూచిపూడి గ్రామంలో మార్చి నాలుగో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు 'సిద్ధేంద్ర భారతీయం' నృత్య వేడుకలు ఘనంగా జరిగాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళాంశాల్లో నృత్యరీతులు కూడా ప్రముఖ పాత్రను పోషిస్తున్నాయి అని అనటంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి భారతీయ సంస్కృతికి ఖండాంతరాల్లో ఎనలేని ప్రఖ్యాతినార్జించిపెట్టిన విభిన్న భారతీయ నృత్యరీతులు 'సిద్ధేంద్ర భారతీయం' పేరుతో ఒకే వేదికపై సాక్షాత్కరించి ప్రేక్షకులకు మధురానుభూతులను అందించాయి. ఐదు రోజుల పాటు సాగిన ఈ సంగీత, నృత్యాది వేడుకలు ప్రేక్షకులను ఓలలాడించాయి. భారతీయ సాహితీ జగత్‌లోని అనేక మంది కవిపుంగవులు సంగీత, నృత్యాది కళలకున్న విశిష్టతను తమ తమ గ్రంథాల్లో ప్రముఖంగా చాటిచెప్పారు. అటువంటి భారతీయ నృత్యరీతుల్లో కూచిపూడి నాట్యం, భరతనాట్యం, మణిపురి, ఒడిస్సీ, కథక్, మోహినీయాట్టం, కథాకళి ముఖ్యమైనవి. ఆ నృత్యరీతులన్ని ఈ ఐదు రోజులపాటు జరిగిన ప్రదర్శనాంశాల్లో చోటు చేసుకోవడం విశేషం. ఇవి దేశంలోని ఒక్కొక్క ప్రాంత వైశిష్ట్యాన్ని చాటుతూ భిన్నత్వంలో ఏకత్వమైన భావనను ప్రస్ఫుటం చేస్తున్నాయి. అఖిల భారత కూచిపూడి నాట్య కళా మండలి కూచిపూడి నృత్య వికాసానికి పాటుపడుతూ మరో వైపు భారతీయ నృత్య రీతుల అభివృద్ధికి, అలాగే సంప్రదాయ కళల వ్యాప్తికి కూడా గత రెండు దశాబ్దాలుగా ఇతోధిక సేవలందిస్తోంది. ఐదు రోజులపాటు జరిగిన సంగీత, నృత్య కార్యక్రమాలు సంగీత, సాహిత్యాభిమానులను మైమరపించి వారి మనసుల్లో చెరగని ముద్రను వేశాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మొదటి రోజు జరిగిన ప్రారంభసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణాజిల్లా కలెక్టర్ కె.ప్రభాకరరెడ్డి ప్రేక్షకుల సంఖ్యను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. మరుసటి రోజు నుండి సమీప ప్రాంతాల నుండి ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండో రోజు నుండి ప్రేక్షకుల సంఖ్య పెరగడంతో అటు కళాకారుల్లో ఇటు నిర్వాహకుల్లో కూడా సంతోషం వెల్లివిరిసింది. తొలిరోజున ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల (విజయవాడ) విద్యార్థినీ, విద్యార్థులు ప్రిన్సిపాల్ అయ్యంగారి శ్యామసుందర్ పర్యవేక్షణలో తమ గాత్ర మాధుర్యంతో ఆలపించిన కృతులు పలువురిని ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ కె.శోభానాయుడు పర్యవేక్షణలో రూపొందించిన 'శ్రీ కృష్ణ పారిజాతం' కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకుల

ఉగాది వసంతం

తెలుగు సంవత్సరానికి ఆదియై
వసంత శోభకు శోభక్రతువై
శిశిర శిబిరానికి శ్రీమంతమై
యుగ, యుగాల యుగధర్మానివై
కాలచక్ర భ్రమణ రథ సారథివై
పూబాలల జాబిల్లి జోలవై
ప్రకృతి పరిమళ పొదరిల్లువై
అందాల వసంతానికి హరివిల్లువై
సుగంధ సుమలతల సౌరభానివై
తాపాన్ని హరించే ఆహ్లాద ప్రమోదీవై
ఆమని ఆలయజేగంటలై వచ్చింది
ప్రకృతి పరిఢవిల్లే సోపాన పల్లకివై
కలిమిలేముల కతీత కాసార మాతవై
రంగ, రంగవైభోగ సాగర మాతవై
చిత్ర, వైచిత్ర సృష్టి వలయవారధియైన
లలిత, లలిత రాగసుధల రేరాణియై
తారణ ఉగాది వసంతం వెలిసింది
భవ, భావ భరిత కావ్యసుధవై
నవమన్మథ ప్రేమామృత పూపొదలైన
పూబోడుల వయ్యార సయ్యాట సైకతానివైన
విరిసిన ఓ వసంత ఉగాది లక్ష్మి వచ్చింది
తారణ నామ సంవత్సర సంకీర్తనమై
బహువిధ బంధుజనుల బాంధవియై
భోగ, భాగ్యాలనిచ్చెడి భాగీరథవై
తెలుగువారి ఇంటి నిత్య, సత్య నీరాజనానివై
తెలుగునోట వెలుగు బాటలు విరజిమ్మే
తెలుగునేల ధన, ధాన్యదులగ్రమ్మి
తెలుగుకోట సిరిసంపదల నిలయమై
తెలుగుగడ్డ శాంతి సౌభాగ్యాలతూగి
తారణ చల్లని తరువుల తల్లియై
ఆంధ్రులకు అమందానంద హారతులు అందించు

- వడ్లమాను వెంకటేశ్వర్లు

కూచిపూడి నృత్యాంశం ప్రదర్శిస్తున్న కలకత్తాకు చెందిన మాధురీ మజుందార్

మన్ననలను పొందింది. అనంతరం కూచిపూడి నాట్య రత్నాల్లో ఒకరైన కీర్తిశేషులు కులపతి భాగవతుల రామకోటయ్య జీవితచరిత్రపై చిత్రీకరించిన వీడియో ఫిలింను ప్రదర్శించారు. రెండోరోజు వివిధ రీతుల నాట్య ప్రదర్శనలు కళలకు ఉన్న ప్రాధాన్యతను తెలియజెప్పాయి. కూచిపూడి నాట్యంతోపాటు కథక్, ఒడిస్సీ, మణిపురి నాట్యాంశాలను పశ్చిమబెంగాల్ నుండి వచ్చిన కళాకారులు ప్రదర్శించారు. కలకత్తాకు చెందిన మాధురీ మజుందార్ ప్రదర్శించిన కూచిపూడి నాట్యం, శృతి బందోపాధ్యాయ మణిపురి నాట్యం, రీనా జానా ఒడిస్సీ నాట్యం, మధుమిత రాయ్ ప్రదర్శించిన కథక్ నాట్యం కదు రమణీయంగా ఉన్నాయి. కలకత్తాలోని రవీంద్రనాథ్ఠాగూర్ విశ్వవిద్యాలయంలో మణిపురి నాట్యశాఖాధిపతి డాక్టర్ శృతి బందోపాధ్యాయ అలుపూ సొలుపూ లేకుండా భక్తిరస సారాంశంలో శాంత, దాస్య, వాత్సల్య, సత్యభామలను చూపించి ప్రజల నీరాజనాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం కూచిపూడి సిస్టర్స్ ప్రదర్శించిన సంగీత సభ, ప్రముఖ నాట్యాచారులు పసుమర్తి శేషుబాబు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం, నికితా దాస్ (న్యూఢిల్లీ) ఒడిస్సీ నాట్యం, కొచ్చిన్‌కు చెందిన అనుపమా మోహన్ ప్రదర్శించిన కూచిపూడి నాట్యం, కేరళ పెరంబూరుకు చెందిన రంగనాథ్ బృందం ప్రదర్శించిన కిరాతం కథాకళి నృత్యనాటికలు కళాభిమానుల్లో చెరగని ముద్రను వేశాయి. నాలుగో రోజు ప్రదర్శించిన క్లారినెట్ వాద్య కచేరి ప్రశంసలందుకుంది. హైదరాబాద్ ఆలిండియా రేడియోలో ఆర్టిస్ట్‌గా పనిచేసిన అచ్చారావు క్లారినెట్‌పై వినిపించిన కీర్తనలు నూతన పోకడలకు నాంది పలికాయి. అనంతరం డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి నట్టువాంగంలో హైదరాబాద్ డిసిపి సి.వి.ఆనంద్ సతీమణి లలితా ఆనంద్ తొలిగా సదాశివ బ్రహ్మేంద్ర కీర్తన (నారాయణ గేయం)కు నర్తించి రక్తికట్టించింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన పి.రమాదేవి, ప్రత్యూష, నివేదితలు ప్రదర్శించిన అంశాలు మన్ననలు పొందాయి. ముగింపు రోజు తెనాలికి చెందిన తల్లా వేదవల్లి ప్రసాద్ చాలించు దేవో మనసా.. ఆరనిలో..అనే భక్తి రస కీర్తన, పలుకే బంగారుమాయెనా కోదండపాణి..అంటూ ఆలపించిన రామదాసు కీర్తనలు కదు రమణీయంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌కు చెందిన మంజులా శ్రీనివాస్ శిష్యురాలు వినాయకుని స్తుతితో ప్రారంభించి సరస్వతీదేవిని ప్రార్థించే కీర్తనలు అలరించాయి. ఆ తర్వాత కూరపాటి రీతా గౌతంలు ప్రదర్శించిన కూచిపూడి నాట్య భంగిమలు ఒక ఎత్తయితే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి క్షేత్ర ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రామనాథం సూత్రధారిగా భామాకలాపం నృత్య కార్యక్రమాలకు తలమానికంగా నిలిచింది. సత్యభామగా యామినీ యశోద, శ్రీకృష్ణునిగా ఏలేసురపు శ్రీనివాస్, మాధవిగా డాక్టర్ చింతా రామనాథం నర్తించి ఆయా పాత్రలకు జీవం పోశారు. మొత్తంగా ఐదు రోజులపాటు జాతీయ స్థాయిలో జరిగిన ఈ నృత్యోత్సవాలు విమర్శకుల నుండి కూడా ప్రశంసలందుకున్నాయి.

-విస్సా శేషగిరిరావు (సాంస్కృతిక ప్రతినిధి-విజయవాడ)

జ్యోతిప్రజ్వలన గావించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ కె. ప్రభాకరరెడ్డి



వజ్రాయుధం

కాలం కేలెండర్‌ని... చూడు!
రాజకీయ ఊసరవెల్లులు రంగులు మార్చే
రుతువిది.
నేతల కూతలు... నీతులు మొదలెట్టే
వాగ్దానాల గానానికి వీధులిక హోరెత్తుతాయ్
రంగుజెండాల తోరణాలు...
రకరకాల గ్రూపుల మధ్య రణాలు..
తమ్ముడూ... మొదలయ్యేది ఎన్నికల జాతర
నైతిక విలువలకిక బహిరంగ ఉప్పు పాతర
చౌరస్తాలు కటౌట్లను చిగురిస్తాయ్
మొసళ్ళన్నీ మీటింగు పెట్టి కన్నీళ్ళు
కారుస్తాయ్
నీ ఆశ వాడి పదవీకాంక్షకు శ్వాస
నీ బాధ వాడి ప్రచారానికి ప్రాస
ఇప్పుడు కురిసే వరాల జల్లు...
రేపటికి తదారిపోయే పొల్లు
తమ్ముడూ.. ఇది ఎన్నికల రుతువు
అందలాల కోసం ఆధునిక మదేంద్రులు
చెడగొడుతున్న క్రతువు.
నూకల వెనుక వలలుంటాయ్..
కేకల వెనుక కుట్రలుంటాయ్...
వజ్రాయుధం మాత్రం నీ చేతిలోనే ఉంది
వృధాగా విసిరేయకు దాన్ని....
జాగ్రత్తగా పదునుపెట్టి సంధించు..
అరాచకాన్ని అందలమెక్కకుండా బంధించు

- సూర్య గరిమెళ్ళ

న్యాయ సలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

40 ఏళ్ళనుండి పరాధీనంలో ఉన్నభూమి దక్కుతుందా?

దాదాపుగా నలభై సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన ఇది. అప్పట్లో ముగ్గురు అన్నదమ్ములు పంచుకోవలసిన రెండున్నర ఎకరాల ఆస్తిని మా నాన్నగారు తన అన్నలకు తెలియకుండా తాగుడికి కేవలం యాభై రూపాయలు తీసుకొని వేరే వ్యక్తికి హామీగా పొలం పెట్టారు. అమ్మకం గాని రిజస్ట్రేషన్‌గాని జరగలేదు. తరువాత కారణాంతరాల వలన మా కుటుంబం ఆ ఏరియా వదిలి వెళ్ళిపోవలసి వచ్చింది. సదరు కరణం, మా నాన్నగారు ఇద్దరు చనిపోయారు. కరణాలు ముగ్గురు, నలుగురు మారినట్టు వినికిడి. అక్కడ గల మా బంధువులు పొలాన్ని కాపాడగలరని మేము ధీమాగా వున్నాము. కాని వారే (బంధువులు) ఆ కరణం కుటుంబంతో చేతులు కలిపి ఆ పొలాన్ని కరణం కుటుంబం కింద చేర్చినట్లు తెలిసింది. ఇప్పుడు మాకు వాస్తవంగా పొలం సర్వే నెం. కూడా తెలియదు. సదరు ఎమ్.ఆర్.ఓ. ఆఫీసులో అడగవలసి వున్న, దాని గురించి తెలుసుకోవాలన్నా ఆర్థిక ఇబ్బందులు. ప్రస్తుతం ఆఫీసుల సంగతి మీకు తెలియంది కాదు. అదియూ గాక ఆ పొలం కరణం గారి పేరు మీద వున్నదని మా బంధువులు (వారి వద్ద డబ్బు తీసుకొని) చెబుతున్నారు. మాకు ఆ పొలం వచ్చే అవకాశం ఏమైనా ఉందా? తగిన సలహా ఇవ్వగలరు.

- ఎల్.వి.రాఘవులు, దర్శి.

అన్నదమ్ములకు సంబంధించిన ఆస్థిని మీ నాన్నగారు ఒక్కరే తాకట్టు పెట్టాడంటే దీన్ని తెలుసుకున్న తర్వాత మీ నాన్నగారి అన్నగాని, తమ్ముడుగాని ఎలాంటి చర్య తీసుకోలేదా అనే విషయం తెలుపలేదు. అమ్మకంగాని, రిజిస్ట్రేషన్ గాని జరగలేదంటున్నారు. కాబట్టి మీరు ముందుగా మీ ఊరు వెళ్ళి మీ గ్రామ 'నక్ష' చూడాల్సి వుంటుంది. ప్రస్తుతం 'విలేజి సెక్రటరీల వద్ద అది లభిస్తుంది. మీరు ఎమ్.ఆర్.ఓ. కార్యాలయానికి వెళ్ళే పని లేదు. మొదటగా మీరు మీ భూమిపైకి ప్రత్యక్షంగా వెళ్ళండి. ఆ భూమి ప్రస్తుతం ఎవరు అధీనంలో ఉంది. వారి పేరు వాకబు చేయడంలో గ్రామపెద్ద పనేమీ కాదు. అది తెలుసుకుని దాని ఆధారంతో సెక్రటరీ గారికి దరఖాస్తు చేసుకోండి. మీరు ఆనవాళ్లు చూపెడితే ఆ సెక్రటరీగారే మీ భూమి యొక్క సర్వే నంబర్ చెబుతారు.

ఈ వ్యవహారం జరిగి 40 సంవత్సరాలు అంటున్నారు. అంటే కాగితాల ప్రకారం ఆ 40 సంవత్సరాలు పరుల అధీనంలో ఉన్నదా? మీ కుటుంబ సభ్యుల పేర్లు ఏమైనా ఉన్నాయా? లేదా అని విచారించి పరాయి వ్యక్తుల అధీనంలో ఉంటే వారు దానికి ఏమైనా కాగితాలు పుట్టించారా ? ఏ కాగితాలు లేకుండానే అనుభవిస్తున్నారా తెలుసుకోవలసి ఉంటుంది.

లిమిటేషన్ ఆక్ట్ ప్రకారం 12 సంవత్సరాలు గాని, ఆ పైన వారి అధీనంలో ఉన్నట్లు ఉంటే మాత్రం మీకు కొద్దిగా కష్టమే. మీరు గత 40 సంవత్సరాల పహాణీ నకల్లు తీసుకుని చూస్తేగాని పూర్తి వివరాలు తెలియవు. 12 సంవత్సరాల లోపు వారి అధీనంలో ఉన్నదంటే మీ చిన్నాయన వాళ్ళు, మీరు పొజిషన్‌లో ఉన్న వాళ్ళని పై దావా వేయాల్సి ఉంటుంది. ఏది చేయాలన్నా ఆలోచించడమే కాకుండా అడుగు ముందుకువేస్తేనే ఏదైనా ఫలితం ఉంటుంది.

జూనియర్ అసిస్టెంట్ పోస్టు వస్తుందా?

నా పేరు ఎమ్.రవి కుమార్. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి మరణించడంతో నేను కాంపిన్సియేట్ గ్రౌండ్స్‌లో అటెండర్‌గా ఉద్యోగం పొందాను. ప్రస్తుతం ఒక ప్రభుత్వ కళాశాలలో పని చేస్తున్నాను.

నేను మార్చి-2002లో ఇంటర్మీడియెట్ 752 మార్కులతో పాసైనాను. కాని కలెక్టర్ గారి కార్యాలయంలో నాకు జూనియర్ అసిస్టెంట్ జాబ్ ఇవ్వలేదు. కారణం అడిగితే ఖాళీలు లేవన్నారు. కాని ఖాళీలు ఉన్నాయని తరువాత తెలిసింది నా పుట్టినతేదీ ప్రకారం నేను ఒక రోజు మైనర్ సర్వీసు చేసి వున్నాను. జి.ఓ.ఎమ్.ఎస్.నెం.349, తేది 12-6-86 ప్రకారం నేను చేసిన ఒక రోజు సర్వీస్ నాట్ కౌంటబుల్ అనే కండిషన్‌తో ఉద్యోగం ఇచ్చారు. నాకు ఇప్పుడు జూనియర్ అసిస్టెంట్ జాబ్ కావలసి ఉంది. హైకోర్టు (ట్రిబ్యునల్)కు వెళితే నాకు జూనియర్ అసిస్టెంట్ జాబ్ వస్తుందని కొందరు మిత్రులు చెప్పారు. అంతేకాకుండా నేను టైప్‌రైటింగ్ ఇంగ్లీష్ లోయర్ గ్రేడ్ ఆగస్టు-2002లో హయ్యర్ గ్రేడ్-ఫిబ్రవరి 2003లో ఫస్ట్ డివిజన్‌లో పాసై ఉన్నాను. కావున నాకు జూనియర్ అసిస్టెంట్/టైపిస్ట్ జాబ్ రావచ్చు అంటున్నారు. కావున తమరు నా విషయంలో సంబంధించిన వివరాలు తెలుపగలరు. నేను హైకోర్టుకు వెళితే జూనియర్ అసిస్టెంట్/టైపిస్ట్ జాబ్ వస్తుందా లేక ఇంకా వేరే ఏమైనా మార్గాలున్నాయా, అలాగే హైకోర్టుకు వెళితే ఎంత ఖర్చు అవుతుంది. దయచేసి తెలుపగలరు.

- ఎమ్.రవి కుమార్, వీరన్నపేట, మహబూబ్‌నగర్.

మీరు ఉద్యోగంలో చేరేనాటికి జూనియర్ అసిస్టెంట్ ఖాళీలు వున్నాయని రుజువు చేయగలిగితే మీరు 'ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్'లో ఒరిజినల్ అప్లికేషన్ వేసుకోవచ్చు. మీరు సమర్పించే పత్రాలకు, ఖాళీలు ఉన్నాయనీ రుజువు చేయాల్సి ఉంటుంది. దానిని కోర్టు వారు పరిశీలించి మీకు జరిగిన అన్యాయాన్ని వారి దృష్టికి తీసుకువస్తే మీకు ఫలితం ఉంటుంది. ఖర్చు విషయానికొస్తే 'వకీలును బట్టి ఫీజు - వాదనను బట్టి ఫలితం'.

రుచి



దీపావళి మీఠా

తయారు చేయు విధానం: ముందుగా కొబ్బరి కాయలను కోరుకోవాలి. నువ్వులను వేయించి గరుకుగా పొడిచేసి ఉంచాలి. అలాగే జాజికాయ, మిరియాలు, దాల్చిన చెక్కలను విడివిడిగా పొడి చేసుకొని పెట్టుకోవాలి. గోధుమ పిండిలో నాలుగు స్పూన్ల నెయ్యి వేసి కలిపి, కొంచెం నీరు చేర్చి గట్టిగా చపాతీ పిండిలాగా కలుపుకొని పైన తడి బట్ట కప్పి ఓ అరగంట అలాగే ఉంచేయాలి. కొబ్బరి కోరుకు రెండు కప్పుల పంచదార చేర్చి మందంగా ఉన్న గిన్నెలో అడుగంటకుండా కలుపుతూ పాకం ముదిరి ముద్దగా అయ్యేంత వరకూ ఉడికించి దించేయాలి. గోధుమ పిండిని నిమ్మకాయంత ఉండలుగా చేసుకొని పల్చగా పూరీల్లా వత్తుకోవాలి. బాణలిలో నెయ్యి వేసి మరిగాక పూరీలను ఎర్రగా వేగి విరిగి పోయేలా కాల్చి తియ్యాలి. చల్లారాక పూరీలన్నింటినీ మెత్తగా కాకుండా, గోధుమ రవ్వ మాదిరిగా దంచి పెట్టుకోవాలి. మందంగా ఉన్న గిన్నె తీసుకొని కప్పు పంచదార వేసి అందులో కొంచెం నీళ్ళు పోసి లేత పాకం తయారు చేసుకోవాలి. మరొక పాత్రలో దంచిన నువ్వు పప్పు పొడి, మిరియాలు, జాజికాయ, దాల్చిన చెక్క పొడులు, పూరీ పొడి, ఉడికించిన కొబ్బరి కోరు అన్నీ వేసి బాగా కలుపుకోవాలి. ఇంతకు ముందు తయారు చేసి ఉంచుకొన్న లేత చక్కెర పాకంలో చేతులు తడుపుతూ ఈ మిశ్రమాన్ని చిన్న లడ్డూల మాదిరిగా చేసి వేరే ప్లేట్‌లో ఉంచాలి. లేతపాకం తయారు చేసిన గిన్నెలోనే మిగిలిన పంచదార వేసి కొంచెం నీటిని చేర్చి స్టౌ పైన ఉంచి ముదురుపాకం తయారు చేయాలి. ఈ పాకం వేడిగా ఉన్నప్పుడే ఒక్కో ఉండపై ఒక పెద్ద స్పూన్‌తో పాకం వేస్తూ మొత్తం ఉండలన్నీ పాకంతో కవర్ చేయాలి. పావు గంట తరువాత పాకం చల్లారి ఉండలపై తెల్లని పొరలా కప్పి ఉంటాయి. వీటిని అందరూ ఇష్ట పడతారు. వారం రోజులు నిల్వ ఉంటాయి.

ఎన్. లతాప్రియదర్శిని
బొజ్జన్నకొండ, విశాఖపట్నం

కావలసిన వస్తువులు:

గోధుమపిండి	: 4 కప్పులు
పంచదార	: 4 కప్పులు
కొబ్బరి కాయలు	: రెండు
నెయ్యి	: 2 కప్పులు
మిరియాలు	: 12
దాల్చిన చెక్క	: 8 ముక్కలు
నువ్వులు	: 1 కప్పు
జాజికాయలు	: రెండు

చేగోడీలు



కావలసిన వస్తువులు:

బియ్యం పిండి	: అరకిలో
డాల్డా లేక వెన్న	: వంద గ్రాములు
మైదా పిండి	: అరకిలో
జీలకర్ర	: 25 గ్రాములు
గసాలు	: 250 గ్రాములు
వాము	: 25 గ్రాములు
నువ్వులు	: వంద గ్రాములు
కారం	: ఒక స్పూన్
నూనె	: ఒక కిలో
ఉప్పు	: తగినంత

తయారు చేసే విధానం:

బియ్యం పిండి, మైదాపిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. పిండిలో నువ్వులు, గసగసాలు, వాము, జీలకర్ర, కారం, ఉప్పు, వెన్న లేక డాల్డా వేసి కలుపుకోవాలి. ఈ పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని అరచేతిలో కొంచె పొడవుగా తాళ్ళుగా చేసి చేగోడీలుగా చుట్టు కోవాలి. స్టౌమీద బాండీ పెట్టి నూనెపోసి కాగనివ్వాలి. ముందుగా చేసి పెట్టుకొన్న చేగోడీలు వేపుకోవాలి. దోరగా వేగిన తర్వాత తీసివేయాలి. ఇవి కరకరలాడుతూ. రుచిగా ఉంటాయి. పదిహేను రోజుల వరకూ నిల్వ ఉంటాయి.

గమనిక

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ రకాల వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తి ఆదివారం అనుబంధం రుచి పేజీలో ప్రచురిస్తాము. వంటకం ఫొటోతో పాటు రాసిన వారి ఫొటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:

రుచి, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోక్‌నగర్,
స్ట్రీట్ నెం:1
హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

టిపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది